

ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్
కోనసీమ జిల్లా వార్తలు
ఆదివారం 10 నవంబరు 2024 | 5

ఆదివారం ప్రత్యేకం





చంద్రబాబుతో అల్లాడ స్వామినాయుడు

'అల్లాడ'కు కలిసొచ్చిన అదృష్టం

6లో

అమలాపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్‌గా ఎంపిక

రెండో విడత నామినేటెడ్ పోస్టుల జాబితాలో చోటు

● కాకినాడ(ఆంధ్రజ్యోతి)

అరచేతిలో అద్భుతమే, కానీ..





ఏదైనా మంచిగా ఉపయోగిస్తే మంచి.. చెడుగా ఉపయోగిస్తే చెడు.. సోషల్ మీడియా కూడా అంతే.. ఒక రకంగా చెప్పాలంటే అరచేతిలో అద్భుతమే మరి.. అనుకుంటే చాలు అమెరికన్ అధ్యక్షుడు ట్రంప్‌కు శుభాకాంక్షలు చెప్పవచ్చు.. పీఎం మోదీని పలకరించవచ్చు.. సీఎం చంద్రబాబును కలవొచ్చు.. పవన్‌నూ కలవొచ్చు.. సమాజానికి ఏదైనా మంచి చేయాలనుకుంటే చాలంతే..! ఒక్క పోస్ట్ పెడితే చాలు వాళ్లే పిలుస్తారు మాట్లాడతారు.. ఎందుకంటే మన అరచేతిలో ఉన్నది అలీబాబా అద్భుత ప్రపంచమే.. ఇటువంటి సోషల్ మీడియాను కొందరు మంచికి ఉపయోగిస్తుంటే.. మరికొంత మంది తమ ఎదుగుదలకు ఉపయోగించుకుంటున్నారు.. ఇంకొంత మంది మాత్రం అవతల వారిని రెచ్చగొట్టే పోస్టులు పెట్టేందుకు ఉపయోగిస్తున్నారు.. అరచేతిలో ఉన్న అద్భుత ప్రపంచాన్ని చేతులారా నాశనం చేస్తున్నారు. అలా కాకుండా ఆ అద్భుతాన్ని ఆస్వాదిస్తే.. ఆనందలోకంలో విహరించవచ్చు.. అద్భుతాలను సృష్టించవచ్చు.

అదోక మాయా ప్రపంచం

- మంచికి మంచి.. చెడుకు చెడు
- అనవసర పోస్టులు పెడితే జైలే
- ఎదగాలన్నా అదే.. సేవకు అదే
- బంధాలను దగ్గర చేస్తుంది..
- స్నేహితులను పెంచుతోంది
- డిజిటల్ లైఫ్‌లో జీవనం
- పెరిగిన 'సోషల్' వినియోగం

సమాజంలో మంచీచెడూ సహజం. అలాగే ప్రతి విషయంలోనూ భిన్నాభిప్రాయాలు ఉంటాయి. వ్యక్తిగత ఇష్టాయిష్టాల నుంచి వ్యవస్థాగత అంశాల వరకు, గల్లీస్థాయి వ్యవహారం నుంచి అమెరికా ఎన్నికల తతంగం వరకు తెలుసుకోవడం, తెలిసిన విషయాలను ఇతరులతో పంచుకోవడం సాధారణంగా జరిగేదే. అయితే సోషల్ మీడియా వచ్చిన తర్వాత ఒక సాంకేతిక విప్లవమే ఆవిష్కృతమైందనే చెప్పాలి. ఇప్పుడు నడుస్తున్నది డిజిటల్ లైఫ్. దశాబ్దం కిందట కేవలం ముఖపుస్తకం (ఫేస్‌బుక్) ప్రధాన వేదిక. తర్వాత బ్లాగ్స్, ఇన్‌స్టా, రీల్స్, యూట్యూబ్ ఇలా వివిధ మాధ్యమాల ద్వారా తమ అంతరంగాన్ని ఆవిష్కరించుకుంటున్నారు. గడిచిన ఆరేడేళ్లలో సోషల్ మీడియా కొత్త పుంతలు తొక్కింది. ఆయా మాధ్యమాల్లో అనేక సాంకేతిక సౌలభ్యాలు అందుబాటులోకి రావడం, అటు ఇంటర్‌నెట్ వేగంలోనూ పెనుమార్పులు రావడంతో మొత్తం సోషల్ మీడియా స్వరూపమే మారిపోయింది.

బంధాలను దగ్గరచేసి..

సరిగ్గా అయిదేళ్ల కిందట వరకూ సోషల్ మీడియాది చాలా పరిమితమైన పాత్ర. మిత్రుల జన్మదినం అయితే ఒక పోస్టు. ఎవరైనా కాలం చేస్తే ఒక రిప్. ఎక్కడికైనా వెళ్లి వస్తే ఫొటో సెషన్. ఇంకా గుడ్ మార్నింగ్‌లు.. పండుగలు పబ్బాలకూ శుభాకాంక్షల వెల్లువ. బంధాలను కలిపి ఉంచడానికి, దూరతీరాల్లో ఉన్నా అనుబంధాలను, పరిచయాలను, స్నేహాలను పదిలంగా కొనసాగించడానికి వచ్చిన అపూర్వమైన అవకాశం.తర్వాతర్వాత కొత్తపుంతలు తొక్కింది. విడివిడి మాధ్యమాలుగా ఉన్న ఈ సాంకేతిక వేదికలన్నీ విద్దూరాలతో నడుస్తోంది. ఆ పరిమితులతోనే లైక్.. కామెంట్.. షేర్ ముచ్చట సాగేది. అపరిమితమైన భావ ప్రకటనా స్వేచ్ఛకు వేదికగానూ సోషల్ మీడియా ఉంది.

రాత్రికి రాత్రే సెలబ్రిటీలుగా..

సోషల్ మీడియా వేదికగా ఎందరో రాత్రికి రాత్రే హీరోలయ్యారు. అంతెందుకు రాజానగరం మండలం వడిశలేరు గ్రామానికి చెందిన రోజు కూలీ బేబీ సోషల్ మీడియా దెబ్బకు సెలబ్రిటీగా మారిపోయింది. మెగాస్టార్ చిరంజీవి వంటి వారి ప్రశంసలు అందుకున్న గాయనిగా నిలిచింది. ఎందరో కళాకారులు, ప్రతిభ చాటిన వారంతా సక్సెస్ బాట పట్టారు. వాట్సప్, ఫేక్‌బుక్ గ్రూపుల ద్వారా ఏర్పాటైన వేదికలు హాస్యాన్ని పంచుతున్నాయి.అనేక సేవలకూ అనుసంధానమై దారి చూపుతున్నాయి.గోదావరి జిల్లా పేరుతో హాస్యం, ఎటకారంతో పలు గ్రూపులు నడుస్తున్నాయి. ఇష్టమున్నా,లేకున్నా మనిషి జీవనంలో అనివార్యంగా మారిన ఈ బుల్లి మీడియాను ఎవరైనా అనుసరించాల్సిందే. లేదంటే వెనకబడిపోతాం.

తప్పుడు పోస్టుకు జీవితఖైదు

సోషల్ మీడియాలో అసభ్య కామెంట్లు, పోస్టులు,మార్ఫింగ్ వీడియోలతో బాధితుల చావుకు కారణమైన వారికి భారత న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్ 111(2)ఏ ప్రకారం మరణశిక్ష, లేదా జీవితఖైదు విధిస్తారు.రూ.10 లక్షలకు తక్కువ కాకుండా జరిమానా. ఒక్కసారి కేసు నమోదైతే ఉద్యోగాలు, పాస్‌పోర్టులు, వీసాలు లభించవు.సోషల్ మీడియాలో అసభ్య పోస్టులు పెట్టేలా ప్రోత్సహించడం, సహకరించడం, ప్రయత్నించడం బీఎన్ఎస్ సెక్షన్ 111 (3)ప్రకారం తీవ్ర నేరం. దీనికి గరిష్ఠంగా ఐదేళ్ల జీవితఖైదు. రూ.5 లక్షల జరిమానా. అసభ్య పోస్టులతో దాడిచేస్తున్న వారిని పోలీసులకు చిక్కకుండా దాచిపెట్టినా, రక్షించినా నేరమే. దీనికి బీఎన్ఎస్ చట్టం సెక్షన్ 111 (5) ప్రకారం మూడేళ్ల గరిష్ఠంగా జీవిత ఖైదు విధిస్తారు. ఫేస్‌బుక్‌లో సైతం పోస్ట్‌చేసే అంశాలపై అనేక నిబంధనలను ఆ సంస్థ విధిస్తోంది.



సోషల్ మీడియా ఎంత శక్తివంతమైనదో చెప్పడానికి ఈ ఒక్క సంఘటన చాలు.. రాజానగరం మండలం వడిశలేరులో రోజు కూలీగా పనిచేసుకునే ఒక మహిళ.. రాత్రికి రాత్రి గాయనిగా మారింది.. ఎంతలా అంటే మెగాస్టార్ చిరంజీవి మెచ్చుకునేటంత..

కాకినాడలో ఇలా..

సేవకు సోషల్ మీడియానే వేదికగా చేసుకుంటున్నారు.మనస్ఫూర్తి,సహాయ్ ఫౌండేషన్, సెర్వ్ నీడీ ఫర్ఏ ఛేంజ్ అంటూ ఫేస్‌బుక్ పేజీల ద్వారా నగరంలో హోటళ్లు, రెస్టారెంట్ల నుంచి మిగిలిన ఆహారాన్ని సేక రించి పేదలకు పంచుతున్నారు.పాత దుస్తు లను సైతం సేకరించి పేదలకు అందిస్తు న్నారు. కాకినాడ జాబ్ అప్‌డేట్స్ పేరుతో 4,600 మంది గ్రూపులో నిరుద్యోగులకు సమాచారం ఇచ్చిపుచ్చుకుంటున్నారు.ఐ లవ్ కాకినాడ పబ్లిక్ గ్రూప్ పేరుతో నగరంలో జరిగే సంగతులు అందరికీ చేరవేస్తున్నారు. ఇందులో 5,600 మంది సభ్యులు ఉన్నారు. కాకినాడ మారథాన్ పేరుతో ఓ సంస్థ ప్రత్యేక ఫేస్‌బుక్ పేజీ ద్వారా అందరికీ ఆరోగ్యానికి సంబంధించిన సమాచారం అందిస్తోంది.



శ్రీయువసేన దత్తత తీసుకున్న తల్లిదండ్రులు కోల్పోయిన చిన్నారులు, విద్యార్థులు

ఒకే ఒక్క పేరుతో సోషల్ మీడియాగా అవతరించింది. వంటల దగ్గర నుంచి కొత్త సాంకేతిక విషయాల వరకు, సాహిత్యం మొదలుకొని సమస్తం తెలిపే సమాచారం వరకూ ఇప్పుడు సోషల్ మీడియానే తొలి వార్తగా చేరవేస్తోంది. ఫన్, వ్యంగ్య కార్టూన్లు, సాహిత్య విషయాలు, వింతలు

దూరమైన స్నేహితుడి కోసం.. శ్రీయువసేన

(ఆంధ్రజ్యోతి- సర్పవరం జంక్షన్)

కాకినాడలో వారంతా స్నేహితులు.. కలసిమెలసి చదువుకున్నారు. వీరిలో మార్నిస్వామి అనే దోస్త్ అనారోగ్యంతో చనిపోవడాన్ని జీర్ణించుకోలేకపోయారు. ఈ స్నేహితుడికి గుర్తుగా 2013లో 30 మంది స్నేహితులతో కలసి శ్రీయువసేన సేవా సంఘాన్ని అధ్యక్షుడుగా డాక్టర్ బొల్లం సతీష్ ఏర్పాటు చేశారు. నిరుపేద విద్యార్థుల విద్య, ఆరోగ్యం, వైద్యం, జీవనోపాధికి తోడ్పాటు అందిస్తున్నారు. రక్తం సేకరించి, నిరుపేదల ప్రాణాలకు భరోసా కల్పిస్తున్నారు. తలసేమియా చిన్నారులను దత్తత తీసుకుని వీరికి అవసరమైన రక్తాన్ని అందిస్తూ చిన్నారుల జీవితంలో వెలుగులు నింపుతున్నారు. వేర్వేరు కారణాలతో తల్లిదండ్రులకు దూరమైన 78 మంది పిల్లలు, విద్యార్థులను దత్తత తీసుకుని గత నాలుగేళ్ల నుంచి పోషిస్తున్నారు.కొవిడ్‌తో తల్లిదండ్రులకు కోల్పోయిన 30 మంది విద్యార్థులను చదివిస్తున్నారు.

భిన్నంగా..

సోషల్ మీడియా ఓ సమాచార దర్శిని. ఓ మానసికోల్లాసాన్ని, విజ్ఞానాన్ని అందించేది. తెలియని సమాచారాన్ని తెలియజేసేది.

- రాజమహేంద్రవరానికి చెందిన ప్రముఖ వైద్యుడు కర్రి రామారెడ్డి తన ఫేస్ బుక్ ద్వారా ఎన్నో విషయాలను పంచుకుంటూ ఉంటారు.కొంతకాలంగా 'అర్థం- పరమార్థం' పేరిట నిర్వహిస్తున్న వాడుకలో ఉన్న అనేక జాతీయాలను తనదైన శైలిలో వివరిస్తారు.
- కొవిడ్ సమయంలో కాకినాడకు చెందిన డాక్టర్ యనమదల మురళీకృష్ణ తన ఫేస్ బుక్ అకౌంట్‌లో విస్తృత స్థాయిలో వైద్యపరమైన సూచనలతో పాటు మెడిసిన్ వాడకాలను సూచించేవారు. అలాగే కొవిడ్ బాధితుల్లో ఆత్మస్థైర్యం నింపడం విశేషం.
- కాకినాడకు చెందిన బొల్లోజు బాబా అధ్యాపకుడు. కవి, రచయిత కూడా. తన చారిత్రక పరిశోధనాంశాలతో అనేక వ్యాసాలు ఫేస్‌బుక్ వేదికగా విశ్లేషిస్తారు. ఆయన మెకంజీ కైఫీతులు పేరిట రాసిన పుస్తకానికి సంబంధించి సోషల్ మీడి యాలోనూ అనేక వ్యాసాలు అందించడం ద్వారా చారిత్రక అంశాలపై అవగాహన కల్పించారు.

సోషల్..కల్లోలం!

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

సోషల్ మీడియా.. ఇప్పుడీ పేరు మార్మోగిపోతోంది. వ్యక్తులు, పార్టీలు, కుటుంబాల పేరిట ఓ పక్షం లేనిపోనివన్నీ పోగేసి కల్పితాలను వ్యాపింపచేస్తూ సామాజిక కల్లోలం రేపుతోంది. కట్టుబాట్లు, నిబంధనలు, విలువలకు పాతరేసి తమ పక్షం ప్రయోజనాలే పరమావధిగా ఎదుటి వ్యక్తులను, కుటుంబాలను, ముఖ్యంగా మహిళల శీలాన్ని శంకిస్తూ సైతం సోషల్‌మీడియా వేదికగా అబద్ధాలతో బజారుకీడుస్తోంది. దీనికి ఎన్నో ఉదాహరణలు గడచిన ఐదేళ్లలో ఉన్నాయి.

అక్కడ.. ఇదిగో ఇక్కడ..

2020లో పిఠాపురంలో దేవతామూర్తుల విగ్రహాలను అగంతకులు ధ్వంసం చేశారు. దీనిపై హిందూ సంఘాలు, భక్తులు ఆందోళనలో ఉన్న సమయంలో ఆ పక్కనే ఇంకో ఆలయంలోను ఇలాగే జరిగిందంటూ వేరే ఎక్కడో ధ్వంసమైన ఆలయాల ఫొటోలు తెచ్చి ఫేస్‌బుక్‌ల్లో ప్రచారం చేసి మత ఘర్షణలు సృష్టించే ప్రయత్నాలు కొందరు ఆకతాయిలు చేశారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో పిఠాపురం నుంచి పవన్ పోటీకి ఇంకా మొగ్గు చూపకముందే పవన్ కాకినాడ నుంచి పోటీ అని ఒకసారి, కాకినాడ ఎంపీగా అని మరోసారి సోషల్ మీడియాలో హల్‌చల్ చేశాయి.పవన్ పిఠాపురం నుంచి పోటీచేస్తుండడంతో టీడీపీ నేత వర్మ పార్టీకి రాజీనామా చేశారంటూ దుష్ప్రచారాలు సోషల్ మీడియాలో చేపట్టారు. కొవిడ్‌లో జిల్లాలో వచ్చిన కేసులకంటే రెట్టింపు సంఖ్యతో లేనిపోని అలజడిని కొందరు ఆకతాయిలు సృష్టించి జనాలను భయపెట్టారు.

కాకినాడలో గతంలో పెద్దాపురంలో అంబటి ఆయిల్ పరిశ్రమ,కాకినాడలో టైకీ, ప్యారీ షుగర్స్ పరిశ్రమల్లో ప్రమాదాలు జరిగినప్పుడు చనిపోయిన వారి సంఖ్యపై లేనిపోని భయాందోళనలు సృష్టించిన సంఘటనలు ఉన్నాయి. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు తనవద్ద పనిచేసే దళిత డ్రైవర్‌ను ఎమ్మెల్సీ అనంతబాబు హత్య చేసినట్టు పోలీసుల ఎదుట అంగీకరించారు. కానీ వైసీపీ మూకలు ఈ హత్యను అసలు అనంతబాబు చేయలేదంటూ,హత్య ఘటనపై రకరకాల విషవ్యాప్తి చేసి వేరే పార్టీలకు అంటగట్టే ప్రయత్నాలు చేసిన ఘటనలు ఉన్నాయి. తూర్పు గోదావరి జిల్లాలో చిరుతపులి సంచరించిన సమయంలో కూడా ఫేక్ పోస్టులతో అటవీ అధికారులను..ఇటు ప్రజలను భయపెట్టారు. కాకినాడ జిల్లా పత్తిపాడులో పెద్ద పులి సంచారంపై కూడా ఇదే జరిగింది.

కూటమి నేతలకు 'నామినేటెడ్' షాక్

ఆశలు పెట్టుకున్న నేతలు డీలా

ఇప్పటివరకు తమకు పదవులు వస్తాయని ఊహల పల్లకిలో ఊరేగిన నాయకులు

రెండో జాబితాలో ఒకే ఒకరికి చోటు

అమలాపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్‌గా అల్లాడ స్వామి

(అమలాపురం-ఆంధ్రజ్యోతి):

కూటమి ప్రభుత్వం విడుదల చేసిన నామినేటెడ్ పోస్టుల రెండో విడత జాబితా పలువురికి ఝలక్ ఇచ్చింది. మలివిడత నామినేటెడ్ పోస్టుల భర్తీలో టీడీపీకి చెందిన ఓ కీలక నేతను మాత్రమే పదవి వరించింది. ఆశలు పెంచుకున్న ఎందరో నేతలు నిరాశ నిస్పృహలతో ఉన్నారు. పార్టీ అధిష్ఠానం తమ పేర్లను పట్టించుకోకపోవడంపై కొందరు టీడీపీ నేతలు ఆగ్రహావేశాలకు లోనవుతున్నారు. శనివారం 59 కార్పొరేషన్ల చైర్మన్ పదవులను భర్తీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీనిలో భాగంగా కోనసీమ జిల్లా నుంచి అమలాపురం పట్టణానికి చెందిన టీడీపీ జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి అల్లాడ స్వామినాయుడును అమలాపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. స్వామినాయుడు మినహా జిల్లాలో మరెవ్వరికీ నామినేటెడ్ పోస్టుల మలివిడత జాబితాలో స్థానం దక్కలేదు. దాంతో అందరూ ముఖ్యంగా టీడీపీ, జనసేన నేతలు పార్టీ అధిష్ఠానాల తీరుపై నిప్పులు చెరుగుతున్నారు. టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీలో అంకిత భావంతో కొనసాగుతున్న స్వామినాయుడు అంచెలంచెలుగా పార్టీలో పదవులు నిర్వహిస్తూ ప్రస్తుతం జిల్లా పార్టీ కార్యదర్శి హోదాలో కొనసాగుతున్నారు. గతంలో అమలాపురం మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పనిచేశారు. మిగిలనవన్నీ పార్టీ పదవులే. అయితే ఈ సారి కీలకమైన అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ పదవి లభించడంతో టీడీపీ శ్రేణులతో పాటు ఆయన వర్గీయుల్లో హర్షాతిరేకాలు మిన్నంటాయి. సౌమ్యుడుగా ఉండే స్వామినాయుడు రాజకీయంగా కీలకనేతలతో మంచి సంబంధాలు ఉన్నాయి. వాటిలో ముఖ్యంగా మాజీ మంత్రి యనమల రామకృష్ణుడుతో పాటు జిల్లాలో అనేకమంది కీలక నాయకులతో సన్నిహిత సంబంధాలు కలిగి ఉండడమే ఇప్పుడు ప్లస్ అయింది. రాష్ట్ర వ్యాప్తంగా 59 మందిని కార్పొరేషన్ చైర్మన్ల పదవులు వరించగా వాటిలో కోనసీమ నుంచి మాత్రం స్వామినాయుడుకే అవకాశం దక్కడం వెనుక ఆయన రాజకీయ వ్యూహాత్మక ఎత్తుగడలు కూడా ఫలించినట్టు ప్రచారం జరుగుతోంది. ప్రకటన వెలువడిన వెంటనే స్వామినాయుడు ఇంటి వద్ద అభిమానుల కోలాహలం చోటు చేసుకుంది. అనేక మంది పార్టీ నాయకులు ఆయన్ను కలిసి అభినందనలు తెలిపారు. అయితే జిల్లా వ్యాప్తంగా వివిధ సామాజికవర్గాలకు చెందిన కూటమి నేతలు తమ రాజకీయ భవిష్యత్తు ఏమిటనే దానిపై పార్టీ నేతలతో తర్జనభర్జన చేస్తున్నారు. ఈసారైనా తమ పేర్లను అధిష్ఠానం పరిశీలనలోకి తీసుకోకపోతే భవిష్యత్తు కార్యాచరణ ఏమిటనే దానిపై నేతలు ఆలోచనలో పడ్డారు. పార్టీ కోసం కష్టపడ్డ తమకు ఏదో అవకాశం దక్కుతుందనే ఆశతో ఉన్నామని పలువురు నాయకులు చెబుతున్నారు. కొందరైతే ఇంకా చాలా పదవులను భర్తీ చేయలేదని వాటిలో తమకు అవకాశం ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

అక్రమార్కులకు సిరులు కురిపిస్తున్న 'ఉచిత' ఇసుక



గోపాలపురం ఇసుక ర్యాంపు సమీపంలోని ఇటుక బట్టీ ఆవరణలో ట్రాక్టర్‌తో డంపింగ్ చేసిన ఇసుక

పగలంతా డంపింగ్..

రాత్రంతా లిఫ్టింగ్

చెలరేగిపోతున్న ఇసుక మాఫియా

అధిక ధరకు విక్రయాలు

రావులపాలెం, నవంబరు9(ఆంధ్రజ్యోతి): గృహ అవసరాలకు, పేద ప్రజలకు ఇసుకను అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఉచిత ఇసుక విధానానికి కొందరు మాఫియా సభ్యులు తూట్లు పొడుస్తున్నారు. ఇసుక ర్యాంపు నుంచి ఉచితంగా ట్రాక్టర్లతో గృహ వినియోగదారులు ఇసుకను తరలించుకునేందుకు కల్పించిన అవకాశం కొందరికి కాసులు కురిపిస్తోంది. వైసీపీ పాలనలో ఇసుక ధరలు ఆకాశాన్నంటడంతో గృహ వినియోగదారులు నిర్మాణ రంగ కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న నేపథ్యంలో ఇలాంటి ఇబ్బందులు సామాన్యులు ఎదుర్కొనకుండా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సీఎం చంద్రబాబు ఉచిత ఇసుక పథకాన్ని ప్రవేశపెట్టి సక్రమంగా నిర్వహించాలంటూ అధికారులను ఆదేశించారు. ఈ విధానానికి తూట్లు పొడుస్తూ రావులపాలెం మండలం గోపాలపురం ఇసుక ర్యాంపు నుంచి కొందరు మాఫియా సభ్యులు పగలంతా ట్రాక్టర్లతో పలు ఖాళీ ప్రదేశాలలో ఇసుకను దిగుమతి చేసి అక్కడ నిల్వ చేస్తూ రాత్రి సమయాలలో జేసీబీల సాయంతో లారీలలో ఎగుమతి చేస్తున్నారు. అధిక ధరలకు అమ్మి సొమ్ములు చేసుకుంటున్నారన్న ఆరోపణలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. ఐదు యూనిట్ల లారీ ఇసుక అమలాపురం పరిసర ప్రాంతాలకు వెళ్లాలంటే వినియోగదారుల అవసరాన్ని బట్టి కిరాయితో కలిపి రూ.20 వేల నుంచి రూ.25 వేల వరకు విక్రయించి సొమ్ములు చేసుకుంటున్నారు. ట్రక్కుకు అదనంగా చెక్కలు కట్టిన నాలుగు చక్రాల ట్రాక్టర్‌కు లోడు వేసి రూ.8 వేల నుంచి రూ.10 వేల వరకు విక్రయిస్తున్నారని పలువురు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. ఇంత జరుగుతున్నా అక్రమ ఇసుక వ్యాపారం నిరోధానికి అధికారులు పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది..



ఈతకోట-గంటి రోడ్డులో ఇసుకను ట్రాక్టర్‌కు లోడు చేసిన దృశ్యం

అప్పనపల్లి ఆలయానికి కార్తీక శోభ



ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు

మామిడికుదురు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి బాలబాలాజీ దేవస్థానం కార్తీక శోభను సంతరించుకుంది. దేవస్థానం శనివారం భక్తులతో పోటెత్తింది. వేద పండితులు స్వామివారికి సుప్రభాత సేవ చేసి తొలి హారతి ఇచ్చారు. వేకువజాము నుంచి భక్తులు వైనతేయ నదిలో స్నానమాచరించి స్వామివారి దర్శనానికి బారులు తీరారు. దేవస్థానంలో నిర్వహించే నిత్యకల్యాణంలో అధిక సంఖ్యలో భక్త దంపతులు పాల్గొని కల్యాణం నిర్వహించారు. శనివారం ఒక్కరోజు వివిధ ఆర్జిత సేవల టిక్కెట్ల విక్రయాల ద్వారా రికార్డు స్థాయిలో రూ.4,77,224 ఆదాయం వచ్చిందని సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణరాజు తెలిపారు. భక్తులకు ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా ఏసీ, సిబ్బంది ఏర్పాట్లు చేశారు.



భక్తజన సంద్రం

6లో

వాడపల్లికి తరలివచ్చిన భక్తులు

అపార్ నమోదు 70 శాతం పూర్తి:డీఈవో

అమలాపురం రూరల్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల పూర్తి సమాచారం నిక్షిప్తమై ఉండే అపార్ నమోదు జిల్లాలో ఇప్పటి వరకు 70 శాతం పూర్తయిందని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీంబాషా తెలిపారు. మిగిలిన 30 శాతం అపార్ నమోదును పూర్తి చేసేందుకు పాఠశాలల్లో కలెక్టర్ ఆదేశాల మేరకు 60 శిబిరాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. నర్సరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుకుంటున్న విద్యార్థులందరూ అపార్ ఐడీ నమోదు చేయించుకోవాలని సూచించారు. పేరూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న స్పెషల్ ఆధార్ అప్‌డేట్ డ్రైవ్ క్యాంపును శనివారం ఆయన పరిశీలించారు. అపార్ ప్రక్రియను వేగవంతం చేయాలని క్షేత్రస్థాయి సిబ్బందిని ఆదేశించారు. అనంతరం పాఠశాల ఆవరణను ఆయన పరిశీలించి విద్యార్థుల రక్షణార్థం తీసుకుంటున్న చర్యలను హెచ్ఎం కదలి ఆనందశ్రీనివాసరావును అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందజేస్తున్న పౌష్టికాహారాన్ని తీసుకోవాలని విద్యార్థులకు సూచించారు. పాఠశాల పూర్వ విద్యార్థులు రూ.లక్షతో ఏర్పాటుచేసిన డైనింగ్ హాలు ఏర్పాట్లను ఆయన పరిశీలించి అభినందించారు. పదో తరగతి విద్యార్థులతో ఆయన మాట్లాడుతూ భవిష్యత్తును నిర్దేశించే పరీక్షల్లో సత్ఫలితాలను సాధించాలని సూచించారు. పాఠశాల విద్యార్థులతో మాట్లాడి పలు వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి పేద విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలన్నారు. పదో తరగతి పరీక్షల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. ఉప విద్యాశాఖాధికారి గుబ్బల సూర్యప్రకాశం, సమగ్రశిక్ష సీఎంవో బొరుసు వీవీ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

అంతర్వేది ఆలయానికి పోటెత్తిన భక్తులు



క్యూలో వేచిఉన్న భక్తులు

అంతర్వేది, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): అంతర్వేదిలో కొలువై ఉన్న శ్రీలక్ష్మీనరసింహస్వామివారి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. కార్తీకమాస శనివారం కావడంతో అయ్యప్పదీక్షా మాలధారణ భక్తులు, సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు స్వామివారి అభిషేకాలు, సుదర్శన హోమాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామివారి అన్నప్రసాదం అందించారు. సాయంత్రం లైట్‌హౌస్, సాగరసంగమం, అన్నాచెల్లెలు గట్టు, బీచ్, ప్రదేశాల్లో పర్యాటకులు, భక్తులు సందడి చేశారు.

పేకాట శిబిరంపై దాడి

మామిడికుదురు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదపట్నంలంక గ్రామంలోని ఒక ఇంట్లో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో శనివారం నగరం పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో 19 మంది పేకాటరాయుళ్లను అరెస్టు చేసి, వారి నుంచి రూ.5,12,880 స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ ఎ.చైతన్యకుమార్ తెలిపారు. పరారైన ఒకరిని కూడా అరెస్టు చేస్తామన్నారు. 19 మందిపై కేసు నమోదు చేశామన్నారు. వారిని కోర్టులో హాజరుపరుస్తామని ఎస్ఐ తెలిపారు. ఈ దాడిలో అంబాజీపేట సీఐ భీమరాజు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

తెలుగు సూర్యుడు సీపీ బ్రౌన్

నేడు జయంతి సందర్భంగా..

(ఆంధ్రజ్యోతి-రాజమహేంద్రవరం సిటీ)

తీయనైన తెలుగు భాషను పునర్జీవింపజేసిన వారిలో ప్రథముడు చార్లెస్ ఫిలిప్ బ్రౌన్. ఆయన తెలుగు అధ్యయనాలకు ఎనలేని కృషిచేశారు. తెలుగువారే తెలుగు భాషకు ప్రాధాన్యం తగ్గించుకుంటూ పయనిస్తున్న సమయంలో యూరోపియన్ పండితుడుగా ఉన్న చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ తెలుగు భాషను నేర్చుకుని తెలుగుకు జీవం పోశారు. కలకత్తాలో మిషనరీలో సంస్కృతి పండితుడిగా పనిచేస్తున్న డేవిడ్ బ్రౌన్ దంపతులకు 1798 నవంబరు 10న సీపీ బ్రౌన్ జన్మించారు. తన తండ్రి ద్వారా సంస్కృతం, హిందుస్తానీ, పర్షియన్ నేర్చుకున్నారు. అటుపై ఇంగ్లాండులో హేలీబరీ కాలేజీలోను, భారతదేశంలో మద్రాసు ఫోర్ట్ సెయింట్ జార్జ్ కళాశాలలోను బ్రౌన్ చదివారు. ఆ రోజుల్లోనే ఆయన తెలుగు, మరాఠీ భాషలను నేర్చుకున్నారు. తెలుగు భాషపై ఎనలేని మక్కువను పెంచుకున్న బ్రౌన్ అప్పట్లో ఈస్ట్ ఇండియా కంపెనీలో చేరారు. కడపలోని ప్రిన్సిపల్ కలెక్టర్‌కు అసిస్టెంట్‌గా నియమితుడయ్యారు. అప్పటి కలెక్టర్ జాన్‌హన్‌బరీ భాషపై నిష్ణాతుడు కావడంతో అతని ద్వారా ప్రేరణ పొంది తెలుగు భాషను పూర్తిగా నేర్చుకున్నారు. తన జీవితంలో తెలుగు భాస అధ్యయనం కోసం తన సమయాన్ని అంతా కేటాయించి తెలుగు తాళపత్ర వ్రాత ప్రతులను సేకరించారు. వేమన పద్యాలను వెలికితీసి ప్రచురించాడు. నలచరిత్రను, ఆంధ్రమహా భారతం, శ్రీమద్భాగవతాలను ప్రచురించారు. తెలుగు నేర్చుకునే వారికోసం వాచకాలు, వ్యాకరణ గ్రంథాలు రాశాడు. ఆయన కృషితోనే నేడు బ్రౌన్ డిక్షనరీ కూడా ఉంది. వసు చరిత్ర, మనుచరిత్ర, పలనాటి వీరచరిత్ర ప్రచురించాడు. ఆయనకు తెలుగు సూర్యుడు అనే బిరుదు కూడా ఉంది. తెలుగుకు ఎంతో సేవలందించిన బ్రౌన్ జన్మదినం నేడు.



రాజమహేంద్రవరంలో బ్రౌన్ మందిరం





సీపీ బ్రౌన్ మందిరం.. నిర్వాహకులు, ప్రాణహిత కవి సన్నిధానం నరసింహ శర్మ

తెలుగుభాషా వికాసానికి, భాషావేత్తలను సత్కరించేందుకు, తెలుగు ఘనత చాటేందుకు రాజమహేంద్రవరంలో సీపీ బ్రౌన్ మందిరం ఏర్పడింది. బ్రౌన్ మందిరం వేదికగా తెలుగు భాష పరిపుష్టి కావాలని భావించి ప్రాణహిత కవి సన్నిధానం నరసింహశర్మ, సీనియర్ జర్నలిస్టు, ఆయన సోదరుడు సన్నిధానం శాస్త్రి సంయుక్త నిర్ణయంతో వారి ఇంటినే బ్రౌన్ మందిరంగా మార్చేశారు. తెలుగుభాషకు ప్రాణప్రతిష్ట చేసిన బ్రౌన్ అంటే ఎంతో ఇష్టంతో వారు ఈ పేరు పెట్టుకున్నారు. అప్పటి నుంచి ఎందరో ప్రముఖులు ఈ ఇంటి కార్యక్రమాలకూ తరలి వస్తున్నారు. ఎలాంటి హంగూఆర్భాటాలూ లేకుండా తెలుగుభాషకు పట్టంగట్టే వారందరినీ ఇక్కడ సముచితరీతిలో సత్కరిస్తున్నారు. 2003 మే 4న ఈ సత్కార్యానికి పద్మశ్రీ, పద్మభూషణ్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్‌తోనే శ్రీకారం చుట్టారు. ఒక ఇంటికి ఈవిధంగా బ్రౌన్ పేరుపెట్టడం మరెక్కడా లేదు. భాషాభివృద్ధి కార్యక్రమాలకు తమ ఇంటికే ఒక వేదికగా చేసిన ఈ ఇద్దరి సోదరులను ప్రశంసించని వారు లేరు. దాంతో రాజమహేంద్రవరం సీపీ బ్రౌన్ మందిరం అంటేనే తెలుగు భాష గుర్తుకువచ్చేలా మారింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న రచయితలు, భాషాభిమానులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు రాజమహేంద్రవరం వస్తే బ్రౌన్ మందిరాన్ని సందర్శించే సంప్రదాయం కొనసాగుతోంది. యార్లగడ్డ లక్ష్మీప్రసాద్‌తోపాటు గొల్లపూడి మారుతీరావు, గజల్ శ్రీనివాస్, తుర్లపాటి కుటుంబరావు, మాడుగుల నాగఫణిశర్మ, గోరటి వెంకన్న, జేడీ లక్ష్మీనారాయణ, దర్శకులు మాధవపెద్ది సురేష్, చిన్మయి తమ్మారెడ్డితోపాటు గురజాడ అప్పారావు, గిడుగు రామ్మూర్తి, పింగళి వెంకయ్య వారసులు సీపీ బ్రౌన్ మందిరాన్ని సందర్శించారు. తెలుగు భాషాభివృద్ధికి కృషి చేస్తున్న నరసింహశర్మకు జీవన సాఫల్య పురస్కారం, సన్నిధానం శాస్త్రికి గిడుగు రామ్మూర్తి స్మారక పురస్కారం లభించింది. సోదరులిద్దరూ సీపీ బ్రౌన్ స్ఫూర్తిని నేటికీ కొనసాగిస్తున్నారు.

ప్రపంచ వ్యాధి నివారణ టీకా దినోత్సవం



టీకా.. ఆరోగ్యానికి భరోసా!

చిన్నారులకు వరం 'వ్యాధి నిరోధక' టీకాలు.. వ్యాక్సిన్లతో రోగాలు దూరం


రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రాణాంతకమైన వ్యాధులకు భరోసాగా ప్రస్తుతం అనేక టీకాలు అందుబాటులోకి వచ్చాయి. నిజానికి టీకాలు తయారయ్యేది ఆయా వ్యాధులకు కారణమయ్యే సూక్ష్మక్రిములతోనే అన్న విషయం చాలామందికి తెలియదు. ఒక వ్యాధిని నిర్మూలించడానికి ఆ వ్యాధికి కారణమయ్యే సూక్ష్మక్రిమిని అతి తక్కువ మోతాదులో శరీరంలోకి పంపి దానికి రోగ నిరోధకశక్తిని పెంపొందించడమే వ్యాక్సిన్లలోని సూత్రం. ఒకసారి శరీరంలో ఒక వ్యాధికి సంబంధించిన సూక్ష్మక్రిములను ఎదుర్కొనే యాంటీబాడీస్ తయారైతే భవిష్యత్తులో ఆ వ్యాధిని నిరోధించడంలో రోగ నిరోధకశక్తి తేలిగ్గా విజయం సాధిస్తుంది. క్షయ, కంఠసర్పి, కోరింతదగ్గు, ధనుర్వాతం, గవదబిళ్లలు. రుబెల్లా, న్యుమోనియా, కామెర్లు, పోలియో, విరేచనాలు.. ఇలా పిల్లలను ఉక్కిరిబిక్కిరి చేసే ఎన్నో రకాల జబ్బులకు రోగాలకు వ్యాక్సిన్లతో అడ్డుకట్ట వేయవచ్చు. నిజానికి పిల్లలకు తొలి టీకా తల్లిపాలే అని వైద్యులు చెబుతుంటారు. బిడ్డ పుట్టినప్పటి నుంచీ చేపట్టే వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం చిన్నారులకు ఒక వరం. జాతీయ ఇమ్యునైజేషన్ షెడ్యూల్ ప్రకారం ఈ కార్యక్రమం జరుగుతోంది. గర్భిణీలకు గర్భిణీ సమయంలో ధనుర్వాతం రాకుండా రెండు డోసులు టీడీ వ్యాక్సిన్ ఇస్తారు. నెలరోజుల వ్యవధిలో వీటిని ఇస్తారు. ఆ తర్వాత బిడ్డ పుట్టిన తొలిరోజున బిడ్డకు హెపటైటిస్ - బి వ్యాక్సిన్ ఇస్తారు. బిడ్డ పుట్టిన 24 గంటల్లోనే దీన్ని వేయాల్సి ఉంటుంది. బిడ్డ పుట్టిన తర్వాత 15 రోజుల లోపు పోలియో వ్యాధి రాకుండా ఓరల్ పోలియో చుక్కలు వేస్తారు. నెల రోజుల లోపు టీబీ వ్యాధి రాకుండా బీసీజీ టీకా వేస్తారు. బిడ్డకు ఆరు వారాలకు మొదటి డోసుగా... ఓరల్ పోలియో, పెంటావాలెంట్ వ్యాక్సిన్, రోటా వ్యాక్సిన్, ఐపీవీ, పీసీవీ వ్యాక్సిన్లు ఇస్తారు. అలాగే పది వారాలకు వీటినే రెండో డోసుగా ఇస్తారు. 14 వారాలకు మూడవ డోసు వేస్తారు. బిడ్డకు తొమ్మిది నెలలకు మీజిల్స్ రెబెల్లా మొదటి డోసు, ఐపీవీ, పీసీవీ బూస్టర్ డోసులు, విటమిన్-ఏ ద్రావణం మొదటి డోసు వేస్తారు. బిడ్డకు 16-24 వారాలకు మీజిల్స్ రుబెల్లా రెండవ డోసు, డీపీటీ మొదటి డోసు వేస్తారు. వీటితోపాటు ఓపీవీ బూస్టర్ డోసులు, విటమిన్ - ఏ ద్రావణం రెండవ డోసు వేస్తారు. బిడ్డకు ఐదు సంవత్సరాలకు డీపీటీ బూస్టర్ డోసు వేస్తారు. 10 సంవత్సరాలకు ఒక డోసు టీడీ వ్యాక్సిన్ వేస్తారు. వ్యాధి నిరోధక కార్యక్రమంలో మొత్తం 12 రకాలైన వ్యాక్సిన్‌లు ఉపయోగిస్తారు. పిల్లలకు ఎలాంటి ప్రాణాపాయ సమస్యలు రాకుండా దాదాపుగా అన్ని వ్యాధులకు ఈ టీకాలు ఉన్నాయి. విటమిన్ -ఏ ద్రావణాన్ని ఆరు నెలలకు ఒకసారి 9నెలల నుంచి 60నెలల దాకా వేస్తారు.

వ్యాక్సిన్ల షెడ్యూలు ఇలా...

జిల్లాలో వ్యాక్సినేషన్ షెడ్యూలు ఇలా ఉంటుంది. గర్భిణీలకు, ఐదేళ్లలోపు పిల్లలకు వ్యాక్సినేషన్ చేస్తారు. నెలలో ప్రతి బుధవారం, శనివారం అన్ని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు, పట్టణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు, అంగన్వాడీ సెంటర్లు, గ్రామసచివాలయాల్లో వ్యాక్సిన్లు వేస్తారు. ప్రతి వ్యాక్సినేషన్ సెషన్‌ను ఏఎన్‌ఎం, ఆశ కార్యకర్త, అంగన్వాడీ కార్యకర్త నిర్వహిస్తారు. జిల్లాలో ప్రతి నెలా 1143 వ్యాక్సినేషన్ సెషన్లు జరుగుతాయి. ప్రతి నెలా కొత్తగా 2330 మంది గర్భిణీలకు, 2060 మంది చిన్నారులకు వ్యాక్సినేషన్ చేస్తారు. ఈ ఏడాది అక్టోబరు నెలనాటికి 13,023 మంది పిల్లలకు వ్యాక్సినేషన్ వేయడం జరిగింది. రాజమహేంద్రవరం జీజీహెచ్‌తో సహా జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లోనూ ఒక నిర్దిత షెడ్యూల్ ప్రకారం వ్యాక్సినేషన్ జరుగుతుంది.

చిన్నారులకు రక్ష.. వ్యాక్సినేషన్

0-5 ఏళ్లలోపు పిల్లలకు వ్యాధి నిరోధకశక్తి తక్కువగా ఉంటుంది కాబట్టి వారికి ఎలాంటి వ్యాధులు సోకకుండా ముందుజాగ్రత్తగా వ్యాక్సినేషన్ చేయడం జరుగుతుంది. హైరిస్క్ ఏరియాలను ముందుగానే గుర్తించి అక్కడ పిల్లలకు వ్యాక్సినేషన్ చేయడం జరుగుతుందని తూర్పుగోదావరి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు.



శాస్త్రీయ విజ్ఞానమే ప్రపంచ శాంతికి మూలం

నేడు శాంతి, అభివృద్ధి కోసమే ప్రపంచ సైన్స్ దినోత్సవం

జేఎన్టీయూకే, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రజల రక్షణ, సంక్షేమం సమగ్రాభివృద్ధే లక్ష్యంగా 1997లో యునెస్కో ఇంటర్నేషనల్ కౌన్సిల్ ఫర్ సైన్స్ బుడాపెస్ట్‌లో మొట్టమొదటి ప్రపంచ శాస్త్రీయ సమావేశాన్ని నిర్వహించారు. దీనిలో సైన్స్ సమాజానికి అవగాహన కల్పించాల్సిన అవసరముందని పలువురు ప్రతినిధులు అంగీకరించారు. ఈ సమావేశంలో ఏకగ్రీవ నిర్ణయం ద్వారా సైన్స్ కోసం ఒక ప్రత్యేక రోజు లేదా వారాన్ని అంకితం చేయాలని ఒక ఏడాది తరువాత యునెస్కో ఎగ్జిక్యూటివ్ బాడీ శాంతి అభివృద్ధికోసం ప్రపంచ సైన్స్ దినోత్సవాన్ని ఆమోదించింది. దీనిని నవంబరు 10న ప్రపంచ వ్యాప్తంగా జరుపుకోవాల్సి ఉంది. 2001లో శాంతి అభివృద్ధి కోసం ప్రపంచ సైన్స్ దినోత్సవం అనేక ప్రాజెక్టులు కార్యక్రమాలు, నిధులను రూపొందించింది. 2002 నవంబరు 10న శాంతి, అభివృద్ధి కోసం మొదటి ప్రపంచ సైన్స్ దినోత్సవాన్ని ప్రపంచవ్యాప్తంగా నిర్వహించారు. సైన్సు ప్రజల జీవితాన్ని మెరుగుపరచడంలో ఎలాంటి కీలక పాత్ర పోషిస్తుందో అర్థంచేసుకోవడానికి ప్రజలకు సహాయపడే రోజు ఇది. ఐక్యరాజ్య సమితి 2030 సుస్థిరాభివృద్ధి అజెండాలో విద్య, వాతావరణం, లింగ సమానత్వం నుంచి సుస్థిరాభివృద్ధి వరకూ సుమారు 17 ప్రపంచ లక్ష్యాలున్నాయి. ప్రపంచ సైన్స్ దినోత్సవం సమాజంలో సైన్స్ ముఖ్యమైన పాత్రను, స్థిరమైన సమస్యలపై చర్చలతో విస్తృతంగా ప్రజలను నిమగ్నంచేయాల్సిన అవసరాన్ని తెలియచేస్తుంది. ఇది మన దైనందిన జీవితంలో సైన్స్ ప్రాముఖ్యతను నొక్కిచెబుతుంది.

సైన్స్‌తోనే అభివృద్ధి

మన జీవితంలో సైన్స్ అనేది లేకపోతే అభివృద్ధి అనేదే లేదు. అంతే కాకుండా ప్రపంచ దేశాలన్నీ ఈరోజు ప్రతీ రంగంలోనూ అభివద్ధి పదంలో నడుస్తున్నాయంటే అది సైన్స్‌తోనే సాధ్యమవుతున్నది. ప్రాచీన కాలం నుంచి నేటి వరకూ జరిగిన అభివృద్ధి అంతా సైన్స్ ద్వారానే సాధించాం. అంతే కాకుండా ఆధునిక సాంకేతికత, పరిశోధనలకు కూడా ఉపయోగపడేది సైన్స్ మాత్రమే. ఒకరకంగా చెప్పాలంటే సైన్స్ లేనిదే మానవ మనుగడనేది లేదు.

మేడమ్ క్యూరీ తన పరిశోధనకు పేటెంట్ తీసుకోలేదు



సైన్స్ మానవులందరిదీ. దాని ద్వారా అందరూ లబ్ధిపొందుతారు.అంతే కానీ ఏ ఒక్కరిదీ కాదు. అందుకే రెండుసార్లు నోబెల్ బహుమతి సాధించిన మేడమ్ క్యూరీ తాను చేసిన పరిశోధనకు పేటెంట్ హక్కు తీసుకోలేదు. అంతేకాదు విద్యార్థులు సైన్స్‌లో పూర్వం మాదిరిగా రాణించకపోవడానికి కారణం చేతితో సమస్యను పరిష్కరించడం మానే సిజవాబులు చదువుతున్నారు. విద్యార్థుల్లో మార్పు వస్తేనే సైన్స్ అభివృద్ధి చెందుతుంది. శాస్త్రీయ దృక్పథంతోనే పురోగతి సాధ్యం.

- ప్రొఫెసర్ కేవీఎస్‌జీ మురళీకృష్ణ, జేఎన్టీయూకే, ఉపకులపతి

రుడా చైర్మన్‌గా బీవీఆర్ చౌదరి

రాజమహేంద్రవరం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంట్ అథార్టీ (రుడా) చైర్మన్‌గా తెలుగుదేశం పార్టీ సీనియర్‌నేత బొడ్డు వెంకటరమణచౌదరి (బీవీఆర్ చౌదరి) నియమితులయ్యారు. శనివారం ఈ మేరకు ఉత్తర్వులు విడుదలయ్యాయి. ఈయన ప్రస్తుతం రాజానగరం అసెంబ్లీ నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జిగా ఉన్నారు. ఆయన తండ్రి బొడ్డు భాస్కరరామారావు తెలుగుదేశం పార్టీలో కీలకనేతగా ఉండేవారు. రెండుసార్లు ఎమ్మెల్యే, ఒకసారి ఎమ్మెల్సీగా పనిచేశారు. ఆయన వారసుడిగా రాజకీయాల్లోకి వచ్చిన వెంకటరమణ చౌదరి 2014 ఎన్నికల్లో రాజమహేంద్రవరం లోక్‌సభ నుంచి వైసీపీ అభ్యర్థిగా పోటీచేసి ఓటమిపాలయ్యారు. తర్వాత కొద్ది రోజులు మౌనంగా ఉండి తర్వాత తెలుగుదేశం పార్టీలో చేరారు. ఎన్నికలకు ముందు రాజానగరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జిగా బాధ్యతలు చేపట్టి పార్టీని బలోపేతం చేశారు. గత ఎన్నికల్లో ఆయనకే ఎమ్మెల్యే టికెట్ ఇస్తానని.. సుమారు 30 ఏళ్లపాటు ఆయన ఇక్కడ రాజకీయం చేస్తారని ఎన్నికల ముందు చంద్రబాబు కోరుకొండ సభలో ప్రకటించారు. తర్వాత జనసేన, బీజేపీతో పొత్తు కారణంగా చాలా మంది ఎమ్మెల్యే టిక్కెట్లను త్యాగం చేయవలసి ఉంది. వీరిలో వెంకటరమణ ఒకరు. గత ఎన్నికలలో రాజానగరం నుంచి జనసేన అభ్యర్థి బత్తుల బలరామకృష్ణ విజయం సాధించడానికి వెంకటరమణ చాలా కృషి చేశారు. ఎట్టకేలకు ఆయన కష్టానికి ఫలితం దక్కింది. ఉన్నత విద్యావంతుడైన వెంకటరమణ చౌదరి బిట్స్ పిలానీ నుంచి మాస్టర్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్‌లో గ్రాడ్యుయేషన్ చేశారు. యుటి డల్లాస్ డెవలప్‌మెంట్ అథార్టీలలో ముఖ్యమైనది రుడా. రాజమహేంద్రవరం కేంద్రంగా ఇది 2021లో ఏర్పడింది. 2014లో అధికారంలోకి వచ్చిన టీడీపీ రాజమహేంద్రవరం, కాకినాడ ప్రాంతాలను కలుపుతూ గోదావరి అర్బన్ డెవలప్‌మెంట్ అథార్టీ (గుడా)ను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. తర్వాత రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్ మెంట్ అథార్టి (రుడా) సెపరేటుగా ఏర్పడింది. దీని పరిధి రాజమహేంద్రవరం డివిజన్, కొవ్వూరు డివిజన్‌తో పాటు, అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో కొంతవరకూ విస్తరించి ఉంది. రుడాకు వెంకటరమణ మూడో చైర్మన్. మొదటి చైర్మన్‌గా మేడపాటి షర్మిళారెడ్డి, రెండో చైర్మన్‌గా రౌతు సూర్యప్రకాశరావు పనిచేసిన సంగతి తెలిసిందే.

చంద్రబాబు నాకిచ్చిన మంచి అవకాశం



రుడా చైర్మన్‌గా అవకాశం [illegible] పదవి వల్ల కొందరికి వన్నె వస్తుంది. కొందరి వల్ల పదవులకు వన్నె వస్తుంది. రుడా నిబంధనలు, పరిధి అవగాహన చేసు కుని రుడాకు గుర్తింపు తెస్తా. త్వరలో ముహూర్తం చూసుకుని బాధ్యతలు స్వీకరిస్తాను.


బొడ్డు వెంకటరమణ చౌదరి, రుడా చైర్మన్

అమలాపురాన్ని అభివృద్ధి చేస్తా

అమలాపురం అర్బన్ డెవలప్‌మెంట్ చైర్మన్ అల్లాడ స్వామినాయుడు

అమలాపురం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): అమలాపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్‌గా పట్టణానికి చెందిన అల్లాడ స్వామినాయుడును నియమిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఉత్తర్వులు జారీ చేశారు. పార్టీలో సీనియర్ నాయకుడిగా పేరొందిన స్వామినాయుడు పడిన కష్టానికి ఫలితం లభించిందని పార్టీ శ్రేణులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. టీడీపీలో అనేక కీలక పదవులు నిర్వహించారు. తెలుగు యువత పట్టణ అధ్యక్షుడిగా, తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షుడిగా, రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షుడిగా, అంబాజీపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా పనిచేశారు. ప్రస్తుతం కోనసీమ జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి హోదాలో కొనసాగుతున్నారు.





స్వామినాయుడును అభినందిస్తున్న టీడీపీ రాష్ట్ర నిర్వాహక కార్యదర్శి రమణబాబు


కోనసీమ ప్రాంతం అభివృద్ధికి కృషి చేస్తా : అల్లాడ

కోనసీమ ప్రాంతంలో పట్టణ, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలతో కృషి చేస్తాను. అమలాపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీకి మంజూరయ్యే నిధులతో అన్ని ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పనే లక్ష్యంగా పనిచేస్తా. ముఖ్యంగా పట్టణ, గ్రామీణ ప్రణాళికా విభాగాల్లో లేఅవుట్‌లు, ఇళ్ల నిర్మాణాల్లో ఎటువంటి అక్రమాలు లేకుండా చర్యలు తీసుకుంటా. విచ్చలవిడిగా పెరిగిపోతున్న లేఅవుట్లలోని అక్రమాలను గుర్తించి ప్రజలు నష్టపోకుండా వారిని చైతన్యవంతుల్ని చేస్తాం. అవినీతిని ప్రక్షాళన చేస్తా. నాకు ఇంతటి కీలకమైన పదవి ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు.

ప్రభుత్వ సలహాదారునిగా చాగంటి కోటేశ్వరరావు

స్టూడెంట్స్ ఎథిక్స్ అండ్ వాల్యూస్‌కు అడ్వయిజర్‌గా నియామకం

కేబినెట్ హోదా కల్పిస్తూ ఉత్తర్వులు



సర్పవరం జంక్షన్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి) : ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావును స్టూడెంట్స్ ఎథిక్స్ అండ్ వాల్యూస్‌కి సలహాదారుడిగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. నామినేటెడ్ పదవుల భర్తీలో భాగంగా కాకినాడ రూరల్ మం డలం తిమ్మాపురానికి చెందిన ప్రముఖ ఆధ్యాత్మికకర్త చాగంటి కోటేశ్వరరావును స్టూడెంట్స్ ఎథిక్స్ అండ్ వాల్యూస్‌కి సలహాదారుడిగా నియమించడంపై హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి. ఏకధాటిగా 42 రోజులపాటు సంపూర్ణ రామాయణం, 42 రోజులపాటు భాగవతం, 30 రోజుల్లో శివ పురాణం, 40 రోజులపాటు లలితా సహస్రనామ స్తోత్రాన్ని అనర్గళంగా ప్రవచించి పండితులు, పామరుల మనసులను విశేషంగా ఆకట్టుకున్నారు.

ఇదీ చాగంటి నేపథ్యం: పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరులో చాగంటి సుందర శివరావు, సుశీలమ్మ దంపతులకు 1958 జూలై 14న కోటేశ్వరరావు జన్మించారు. కోటేశ్వరరావుకు భార్య సుబ్రహ్మణ్యేశ్వరి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఏలూరులో ప్రాథమిక విద్యాభ్యాసం జరిగింది. విశాఖలో డిగ్రీతో పాటూ పీజీ డిప్లొమా ఇన్ ఇండస్ట్రియల్ రిలేషన్స్ అండ్ పర్సనల్ మేనేజ్‌మెంట్ కోర్సు చేశారు. మల్లంపల్లి అమరేశ్వర ప్రసాద్ వద్ద సంస్కృతం చదివారు. కాకినాడలో ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సీఐ) మేనేజర్‌గా పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేశారు. కాకినాడ రూరల్ మండలం తిమ్మాపురంలో ఆకొండి లక్ష్మీస్మారక గోశాల ప్రాంగణం లో గోశాలను ఏర్పాటు చేశారు. గోశాల సమీపంలోనే ఇల్లు నిర్మించుకుని ఆధ్యాత్మిక ప్రవచనాలు చేస్తున్నారు. సనాతన ధర్మ పరిరక్షణ కోసం కంచి కామకోటి పీఠాధిపతి, జగద్గురువు శంకర విజయేంద్ర సరస్వతి స్వామీజీ ఆధ్వర్యంలో 39వ చాతుర్మాస్య దీక్ష ఏర్పాటు చేసి 60 రోజులపాటు దిగ్విజయంగా జరిగేలా కృషి చేశారు. ఎఫ్‌సీఐ లో మేనేజర్‌గా ఉద్యోగం చేస్తూనే సెలవు రోజుల్లో ఆధ్యాత్మిక ప్రచనాలు చేసేవారు. హిందూ, సనాతన ధర్మంపై అనేక ప్రవచనాలు చేయడంతో పాటూ అనేక పుస్తకాలు రాసి ప్రచురించారు. వీటిలో రామాయణం, భాగవతం, శివమహాపురాణం, కార్తీకమాస వైభవం, తిరుమల విశిష్టత, శంకర విజయం, దుర్గా వైభవం, దేవీ నవరాత్రులు, శివస్తోత్రం, దశావతారాలు, గోమాత వైభవం, కామాక్షీ వైభవం, శృంగేరి జగద్గురువు వైభవం, పంచనాడీ వైభవం, అరుణాచల మహత్యం, సుబ్రహ్మణ్య వైభవం, లలిత సహస్రనామస్తోత్రం, సౌందర్య లహరి ఆది శంకరాచార్య, రామాయణం, ధర్మం, రుక్మిణి కల్యాణం తదితర పుస్తకాలు రచించారు.

అందుకున్న బిరుదులు: సెప్టెంబరు 2012లో కంచి కామకోటి పీఠం చాగంటికి ప్రవచన చక్రవర్తి బిరుదు ప్రదానం చేసింది. డిసెంబరు 2012లో శృంగేరి శారదా పీఠం చాగంటికి ప్రవచన రత్నాకర అవార్డుతో సత్కరించింది. డిసెంబరు 2013లో సౌత్ ఇండియన్ ఎడ్యుకేషన్ సొసైటీ ప్రతిష్టాత్మక నేషనల్ ఎమినెన్స్ శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి ప్రదానం చేశారు. తిరుపతిలో మార్చి 2014లో రాష్ట్రీయ సంస్కృత విద్యాపీఠం గౌరవ డాక్టరేట్ వాచస్పతితో సత్కరించింది. మార్చి 2015లో ఢిల్లీ తెలుగు అకాడమీ ఉగాది లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును ప్రదానం చేసింది.

తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్సు ప్రామినెంట్ సత్కారం


మార్చి 2016లో రాష్ట్ర ప్రభుత్వం దుర్ముఖి ఉగాదినాడు కళారత్న (హంస) బిరుదు ప్రదానం చేసింది. ఆగస్టు 2021లో విజయవాడ కేఎల్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ డి. లిట్ ప్రదానం చేసింది. నవంబరు 2022లో గురజాడ సాహిత్య సమైక్య గురజాడ పురస్కారంతో సత్కరించింది ఇవే కాకుండా శారదా జ్ఞానపుత్ర, వాచస్పతి పురస్కారం, పిన్నమనేని పురస్కారం, కళారత్న పురస్కారం, ఉపన్యాస చక్రవర్తి తదితర పురస్కారాలను అందుకున్నారు. 2023లో వైసీపీ ప్రభుత్వం చాగంటిని తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మ ప్రచార పరిషత్ సలహాదారునిగా నియమించగా, ఈ పదవిని తీసుకునేందుకు ఆయన ఇష్టపడలేదు.

కుడా చైర్మన్‌గా తుమ్మల బాబు



పెద్దాపురం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కాకినాడ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) చైర్మన్‌గా కాకినాడ జిల్లా పెద్దాపురం మండల పులిమేరు గ్రామానికి చెందిన తుమ్మల రామస్వామి (బాబు) నియమితులయ్యారు. కూటమి ప్రభుత్వం నామినేటెడ్ పదవుల రెండవ జాబితాలో తుమ్మల బాబుకు చోటు దక్కడంతో ఆయన స్వగ్రామం పులిమేరుతో పాటు పెద్దాపురం నియోజకవర్గంలో జనసేన శ్రేణులు బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. ప్రస్తుతం బాబు జనసేన పెద్దాపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా, కాకినాడ జిల్లా జనసేన అధ్యక్షుడిగా కొసాగుతున్నారు. గడచిన కాలంలో ఆయన పులిమేరు పీఏసీఎస్ అధ్యక్షుడిగా పనిచేశారు. అలాగే ప్రజారాజ్యం పార్టీ ఆవిర్భావ సమయంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా యువరాజ్యం అధ్యక్షుడిగా కూడా పనిచేశారు. పార్టీ పట్ల నిబద్ధత, విధేయత కలిగిన నాయకుడిగా ఆయనకు మంచి గుర్తింపు ఉంది. అలాగే పవన్ కల్యాణ్‌తో మంచి సాన్నిహిత్యం ఉండడం ఆయనకు బాగా కలిసి వచ్చింది. గడచిన సార్వత్రిక ఎన్నికల్లో ఆయన జనసేన పార్టీ నుంచి పెద్దాపురం టికెట్ వస్తుందని ఆశించారు. కూటమి అంశం తెరమీదకి రావడంతో ఆ సీటు చివరి నిముషంలో నిమ్మకాయల చినరాజప్పకు దక్కడంతో ఆయన ఒకింత అవేదనకు గురయ్యారు. మళ్లీ జనసేన అధిష్టానం పిలిచి మాట్లాడంతో ఆయన పెద్దాపురంలో కూటమి అభ్యర్థిగా ఉన్న చినరాజప్ప విజయానికి విశేంగా కృషిచేయడమే కాకుండా ఆయన గెలుపునకు కీలకమయ్యారు. నాడు చేసిన త్యాగానికి ఆయనకు కుడా చైర్మన్ పదవి దక్కడంతో ఆయన సంతోషం వ్యక్తం చేశారు. తనను కుడా చైర్మన్‌గా ఎంపిక చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు ఆయన కృతజ్ఞతలు తెలియచేశారు. అలాగే ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్పతో పాటు పలువురు ప్రముఖులు ఆయనకు శుభాకాంక్షలు తెలియచేశారు.

వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తజనం



ఆత్రేయపురం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం భక్తులు పోటెత్తారు. కార్తీక శనివారం కావడంతో వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన వేలాది మంది భక్తులతో వాడపల్లి కిక్కిరిసిపోయింది. సుమారు 50 వేల నుంచి 60వేల మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నట్లు అంచనా వేస్తున్నారు. భక్తులు తీరువీధుల్లో ఏడు ప్రదక్షిణలు జరిపి మొక్కులు చెల్లించారు. రాత్రి వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు జరిగాయి. సుమారు 30 నుంచి 35వేల మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించినట్లు అంచనా. వేకువజామునే స్వామివారికి సుప్రభాత సేవ, బాలభోగం, ఐశ్వర్యలక్ష్మి హోమం తదితర అర్జిత సేవలు నిర్వహించి స్వామివారిని పుష్పాలతో అలంకరించారు. వివిధ సేవల ద్వారా స్వామి వారి ఒక్కరోజు ఆదాయం రూ.53 లక్షలు రికార్డుస్థాయిలో లభించినట్టు ఉపకమీషనర్, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.

ఏపీ శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్‌గా కుడుపూడి సత్తిబాబు

రాజమహేంద్రవరానికి చెందిన టీడీపీ నేత ఎంపిక

గతంలో శెట్టిబలిజ సాధికార కమిటీ చైర్మన్‌గా పనిచేసిన కుడుపూడి



రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ఏపీ శెట్టిబలిజ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా రాజమహేంద్రవరానికి చెందిన టీడీపీ నేత కుడుపూడి సత్తిబాబు నియమితులయ్యారు. కూటమి ప్రభుత్వం శనివారం వివిధ కార్పొరేషన్ చైర్మన్లను ప్రకటించింది. ఇందులో శెట్టిబలిజ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ స్టేట్ చైర్మన్‌గా కుడుపూడి సత్తిబాబు పేరును ఖరారు చేశారు. రాజమహేంద్రవరానికి చెందిన కుడుపూడి సత్తిబాబు సుదీర్ఘకాలం పాటు టీడీపీలో సేవలందించారు. రాష్ట్రంలో టీడీపీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు శెట్టిబలిజ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్‌గా పనిచేశారు. చంద్రబాబు అరెస్టు సమయంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసుతో కలిసి పెద్దఎత్తున ఆందోళనలు చేశారు. అదేవిధంగా మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, ప్రస్తుత ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసులను అక్రమంగా అరెస్టు చేసిన సమయంలోను కుడుపూడి సత్తిబాబు రాజమహేంద్రవరంలో ఉద్యమించారు. ఈ నేపథ్యంలో సత్తిబాబుకు టీడీపీ అధినాయకత్వం గుర్తింపునిచ్చి చైర్మన్‌గా నియమించింది. సత్తిబాబు నియమకం పట్ల సంఘీయులు హర్షం వ్యక్తం చేశారు.

బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తా.

చైర్మన్ పదవి రావడానికి కారకులైన అందరికీ కృతజ్ఞతలు. తనపై పెట్టిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తా. కూటమి ప్రభుత్వ సహకారంతో శెట్టిబలిజల అభివృద్ధికి పాటుపడతా.నన్ను గుర్తించిన పార్టీకి రుణపడి ఉంటా.

కుడిపూడి సత్తిబాబు, శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్



అయినవిల్లి శ్రీవిఘ్నేశ్వరస్వామి ఆలయంలో భక్తుల రద్దీ

శ్రీసిద్ధివినాయకుడి ఆలయం కిటకిట

అయినవిల్లి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): కార్తీకమాస శనివారం సందర్భంగా ప్రముఖ పుణ్యక్షేత్రాలైన అయినవిల్లి శ్రీసిద్ధివినాయక ఆలయం, అన్నపూర్ణాదేవి సమేత వీరేశ్వరస్వామి, ముక్తికాంత క్షణముక్తేశ్వరాలయం, రాజరాజేశ్వరి సమేత ముక్తేశ్వరాలయం భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచి భక్తులు తరలివచ్చి స్వామివార్లను దర్శించుకుని పూజలు చేశారు. అయినవిల్లిలో రహదారులు భక్తులతో కిటకిటలాడాయి. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా సహాయ కమిషనర్, ఈవో ముదునూరి సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది భక్తులకు సేవలందించారు.



దేవస్థానం ఈవో, ఇంజనీరింగ్ అధికారులతో ట్రయిల్‌రన్

విజయవంతంగా పంటు ట్రయిల్‌రన్

అన్నవరం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఈనెల 13న సత్యదేవుడి తెప్పోత్సవం సందర్భంగా సత్యదేవుడు,అనంతలక్ష్మి అమ్మవార్లు పంపా సరోవరంలో విహరించే హంసవాహన పంటుకు శనివారం ట్రయిల్‌రన్ నిర్వహించగా విజయవంతమయింది. ఈవో రామచంద్రమోహన్, ఇంజనీరింగ్ అధికారులు రామకృష్ణ, రాంబాబు, ఎలక్ట్రికల్ డీఈ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. హంసవాహనంపై కేవలం వైదికబృందం మాత్రమే అనుమతిస్తామని ప్రముఖుల కోసం ప్రత్యేక గ్యాలరీని ఏర్పాటు చేస్తున్నట్లు ఈవో తెలిపారు. రెండురోజుల్లో పంటును హంస వాహనంగా తీర్చిదిద్దుతారని ఈవో పేర్కొన్నారు.



గోపాలపురం ఇసుక ర్యాంపు వద్ద వాహనదారులతో మాట్లాడుతున్న సీఐ శేఖర్‌బాబు

ఇసుక రగడ

- ఇసుక ర్యాంపు వద్ద ట్రాక్టర్ డ్రైవర్ల మధ్య వాగ్వివాదం
- ఇతర మండలాల వారికి ఎగుమతులు లేవంటున్న స్థానికులు
- వెస్ట్ గోదావరి వాహనాలకు ఎందుకు లోడ్ చేయరంటూ నిరసన
- జాతీయ రహదారిపై భారీగా నిలిచిన వాహనాలు
- తాత్కాలికంగా ర్యాంపు మూసివేత
- స్థానికులు మాత్రమే ఇసుక తరలించుకోవాలి: తహశీల్దారు ముక్తేశ్వరరావు

రావులపాలెం, నవంబరు9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నూతనంగా చేపట్టిన ఉచిత ఇసుక విధానం రావులపాలెం మండలం గోపాలపురం ఇసుక ర్యాంపులో అమలు చేస్తుండగా ఇక్కడి నుంచి నిత్యం ట్రాక్టర్లపై వివిధ గ్రామాలకు ఇసుకను తరలిస్తున్నారు. ఇదిలా ఉండగా పశ్చిమగోదావరి జిల్లా నుంచి భారీ స్థాయిలో ఇసుక కోసం ట్రాక్టర్లు ర్యాంపు వద్దకు చేరుకున్నాయి. ఈ ర్యాంపు నుంచి కేవలం ఈ మండలంలోని ఉన్న ట్రాక్టర్లకే లోడు చేస్తామని ఇతర మండ లాలకు చెందిన వారు రావొద్దని అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య వివాదం తలెత్తింది. ఇసుక ర్యాంపు వద్ద నుంచి జాతీయ రహదారిపైకి వచ్చే ఇసుక లోడు ట్రాక్టర్‌ను ఆపి జాతీయ రహదారిపైనే ఇరువర్గాలు ఘర్షణకుదిగాయి. మా ట్రాక్టర్లకు లోడు ఎందుకు వెయ్యరంటూ ఇతర ప్రాంతవాసులు, లోడింగ్ చేసేది లేదంటూ స్థానికులు తారాస్థాయిలో ఘర్షణపడ్డారు. దీంతో జాతీయ రహదారిపై ట్రాఫిక్ భారీస్థాయిలో నిలిచిపోయి ప్రయాణికులు ఇబ్బందుల్నుపడ్డారు. సమాచారం తెలుసుకున్న తహశీల్దారు బీఎం ముక్తేశ్వరరావు, సీఐ శేఖర్‌బాబు సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. సీఐ ఆందోళనకారులతో మాట్లాడి ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన ట్రాక్టర్లతోపాటు స్థానిక ట్రాక్టర్లను అక్కడి నుంచి పంపించివేయడయంతో వివాదం సద్దుమణిగింది. అనంతరం తహశీల్దారు, సీఐలు ర్యాంపు బాటలోకి ఎటువంటి వాహనాలు వెళ్లకుండా దారిమూయించివేశారు.

స్థానికులకు మాత్రమే ఇసుక లోడింగ్

- తహశీల్దారు ముక్తేశ్వరరావు

ప్రభుత్వ నిబంధనల మేరకు నదీపరివాహక ప్రాంత గ్రామాల వారు మాత్రమే ట్రాక్టర్లు, ఎడ్లబండ్లతో ఇసుకను తరలించుకోవాలి. గోపాలపురం ర్యాంపునకు సమీప గ్రామాలైన ముమ్మిడివరప్పాడు, ఈతకోట, పొడగట్లపల్లి, కేతరాజుపల్లి, వెదిరేశ్వరం, దేవరపల్లి గ్రామాల వారు ఇక్కడి నుంచి గృహావసరాలకు ఇసుకను తరలించుకోవాలన్నారు. ప్రస్తుతం వివాదం తలెత్తిన నేపథ్యంలో ఇసుక ర్యాంపును తాత్కాలికంగా మూసివేస్తున్నామన్నారు.



గోపాలపురం జాతీయ రహదారిపై వాగ్వివాదానికి దిగిన వాహనదారులు



ఈతకోట గంటిరోడ్డులో చెక్కలు కట్టిన ట్రాక్టర్‌కు లోడు

పగలంతా డంపింగ్.. రాత్రంతా లిఫ్టింగ్

గృహావసరాలకు, పేదప్రజలకు ఇసుకను అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఉచిత ఇసుక విధానానికి కొందరు మాఫియా సభ్యులు తూట్లుపొడుస్తున్నారు. ఇసుక ర్యాంపు నుంచి ఉచితంగా ట్రాక్టర్లతో గృహ వినియోగదారులు ఇసుకను తరలించుకునేందుకు ప్రవేశపెట్టిన ఉచిత ఇసుక పాలసీ కొందరికి కాసులు పండిస్తోంది. వైసీపీ పాలనలో ఇసుక ధరలు ఆకాశాన్నంటడంతో గృహ వినియోగదారులు నిర్మాణరంగ కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న నేపథ్యంలో ఇలాంటి ఇబ్బందులు సామాన్యులు ఎదుర్కొనకుండా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సీఎం చంద్రబాబు ఉచిత ఇసుక పథకాన్ని ప్రవేశపెట్టి సక్రమంగా నిర్వహించాలంటూ అధికారులను ఆదేశించారు. ఈ విధానానికి తూట్లు పొడుస్తూ రావులపాలెం మండలం గోపాలపురం ఇసుక ర్యాంపు నుంచి కొందరు మాఫియా సభ్యులు పగలంతా ట్రాక్టర్లతో పలు ఖాళీ ప్రదేశాలలో దిగుమతిచేసి ఇసుకను నిల్వ చేస్తూ రాత్రి సమయాలలో ఎక్స్‌కవేటర్లతో లారీలలో ఎగుమతులు చేసి అధిక ధరలకు అమ్మి సొమ్ములు చేసుకుంటున్నారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఐదు యూనిట్ల లారీ ఇసుక అమలాపురం పరిసర ప్రాంతాలకు వెళ్లాలంటే వినియోగదారుల అవసరాన్ని బట్టి కిరాయితో కలిపి రూ.20వేల నుంచి రూ.25వేల వరకు విక్రయించి సొమ్ములు చేసుకుంటున్నారు. ట్రక్కుకు అదనంగా చెక్కలు కట్టిన నాలుగుచక్రాల ట్రాక్టర్‌కు లోడువేసి రూ.8వేల నుంచి రూ.10వేలవరకు విక్రయిస్తున్నారని పలువురు బహిరంగంగానే విమర్శిస్తున్నా రు. అక్రమ ఇసుక వ్యాపారంపై అధికారులు చర్యలు తీసుకోకపోవడంపట్ల విమర్శలకు తావిస్తోంది.



అన్నవరం సత్యదేవుడి సన్నిధిలో వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు

భక్తజన గిరీశుడు!

- భక్తులతో పోటెత్తిన సత్యదేవుడి సన్నిధి
- వరుసగా ఐదురోజులపాటు కార్తీక పర్వదినాలు
- శనివారం రూ.60లక్షల ఆదాయం

అన్నవరం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధి భక్తులతో పోటెత్తుతుంది. రద్దీని దృష్టిలో ఉంచుకుని ఒంటిగంట నుంచి వ్రతాలు, రెండుగంటల నుంచి సర్వదర్శనాలు ప్రారంభిస్తున్నారు. మంగళవారం వరకు వరుస పర్వదినాలు ఉండడంతో భక్తులు గణనీయంగా పెరుగుతారని భావించి దానికనుగుణంగా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. శనివారం ఒక్కరోజు 5524 వ్రతాలు జరుగగా వివిధ విభాగాల ద్వారా సుమారు రూ.60లక్షల ఆదాయం లభించింది. సత్రంగదులు లభ్యం కాకపోవడంతో డార్మెటరీలు, విష్ణుసదన్ హాల్స్‌లో ఉచిత వసతి కల్పించారు. ఈవో రామచంద్రమోహన్ ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తూ రద్దీకి అనుగుణంగా సూచనలిస్తుండడంతో భక్తులకు త్వరితగతిన దర్శనభాగ్యం కలుగుతుంది.

మూలనిధికి రూ.2లక్షల విరాళం

సత్యదేవుడి ఆలయ మూలనిధికి హైదరాబాద్‌కు చెందిన ఏ రాజశేఖరరెడ్డి ప్రోటోకాల్ సూపరింటెండెంట్ బలువు సత్యశ్రీనివాస్‌కు రూ.2లక్షలు అందజేశారు. ఈ సందర్భంగా దాతకు సత్యశ్రీనివాస్ స్వామివారి ప్రత్యేకదర్శనం ప్రసాదాలు అందించారు.

భక్తులకు రవాణా సౌకర్యం



భక్తుల కోసం ఏర్పాటుచేసిన టాటా మ్యాజిక్ వాహనాలు

కార్తీకమాసం సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి రైలు, రోడ్డు, ఇతర మార్గాల్లో వచ్చేవారికి దేవస్థానం కల్పిస్తున్న రవాణా సౌకర్యం భక్తులను సంతృప్తి పరుస్తోంది. రైల్వేస్టేషన్, ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి కొండపైకి, కొండదిగువకు దేవస్థానం తరుపున ఏడు బస్సులను సాధారణ చార్జీలతో తీసుకెళుతుండగా కొండపై సత్యగిరి నుంచి రత్నగిరికి 10 టాటా మ్యాజిక్‌లు, రెండు ఉచిత బస్సుల ద్వారా చేరవేస్తున్నారు. భక్తులు గణనీయంగా పెరగడంతో కార్తీకం ప్రారంభం నుంచి ఎన్నడూ లేని విధంగా ఎనిమిది రోజుల్లో సుమారు రూ.6లక్షల ఆదాయం లభించినట్లు రవాణా విభాగ అధికారులు తెలిపారు.

నేడు 10 బస్సులలో ఉచిత ప్రయాణం

భక్తుల రద్దీ నేపథ్యంలో ఆదివారం ప్రకాష్, శారదా, తిరుమల విద్యాసంస్థల నుంచి 10 బస్సుల ద్వారా ఉచిత రవాణా సౌకర్యం కల్పించినట్లు అధికారులు వెల్లడించారు. వృద్ధులు, దివ్యాంగులను నేరుగా లిఫ్ట్ వద్దకు తీసుకెళ్లేందుకు టాటా మ్యాజిక్ వాహనాలను వినియోగించనున్నట్లు ఈవో తెలిపారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.25 లక్షలు విరాళం



విరాళం అందజేస్తున్న దాత గల్లా గుండయ్య దంపతులు

అన్నవరం దేవస్థానంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవా నిత్యాన్నదాన పథకానికి శనివారం హైదరాబాద్‌కు చెందిన గల్లా రోశమ్మ మెమోరియల్ ట్రస్ట్ నిర్వాహకులు గల్లా గుండయ్య దంపతులు ఈ మొత్తాన్ని చెక్కు రూపంలో ఆలయ ఈవో రామచంద్రమోహన్‌కు అందజేశారు. దాతను ఆయన అభినందించి ప్రత్యేక దర్శనం, స్వామివారి ప్రసా దం అందజేశారు. దీనిపై వచ్చేవడ్డీతో ప్రతీఏటా కార్తీకపౌర్ణమి పర్వదినాన అన్నదానం జరిపించాలని దాత కోరారు.

అప్పుల బాధ తాళలేక హోటల్ యజమాని ఆత్మహత్య



మృతి చెందిన సురేష్‌బాబు

ఎటపాక, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తాళలేక పురుగుల మందు తాగి బిర్యానీ హోటల్ యజమాని ఆత్యహత్యకు పాల్పడ్డాడు. ఈఘటన శనివారం అల్లూరిజిల్లా ఎటపాక మండలం పురు షోత్తపట్నంలోని సెయింట్‌ఆన్స్ ప్రైవేట్ పాఠశాల వెనుక(ముత్యాలమ్మతల్లి ఆలయం) సమీపంవద్ద జరిగింది.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పురుషోత్తపట్నం గ్రామానికి చెందిన నూతనపాటి సురేష్‌బాబు (36) కొంతకాలం సారపాక ఐటీసీ (బీసీఎల్)లో పనిచేశాడు. ఈక్రమంలో గత ఐదునెలల క్రితం భద్రాచలం బస్టాండ్ ఎదురుగా బిర్యానీ హోటల్‌ను ప్రారంభించాడు. బిర్యానీ హోటల్ వ్యాపారం ఆశించినస్థాయిలో నడవకపోవడంతో రూ.7లక్షల వరకు అప్పులపాలయ్యాడు. దీంతో మనస్తాపం చెంది, శుక్రవారం రాత్రి ఇంటి నుంచి బయటకు వచ్చి, ఆ రాత్రే పురుగుల మందు తాగాడు. మృతునికి ఇద్దరు కుమారులు, భార్య ఉన్నారు. పోస్టుమార్టం అనంతరం పోలీసులు కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నారు.

తెలుగు సాహిత్య ఔన్నత్యాన్ని విశ్వవ్యాప్తం చేయాలి

- వీసీ ఆచార్య శ్రీనివాసరావు
- 'నన్నయ'లో జాతీయ శతాధిక కవి సమ్మేళనం



శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న వీసీ శ్రీనివాసరావు

దివాన్‌చెరువు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ తెలుగు సాహిత్య రచనలను ప్రపంచ భాషల్లో అనువాదం చేయడంద్వారా తెలుగు సాహిత్య ఔన్నత్యం విశ్వవ్యాప్తం అవుతుందని ఉపకులపతి ఆచార్య వై.శ్రీనివాసరావు అన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో తెలుగుశాఖ, శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో శనివారం గోదావరి కవనోత్సవం-141వ జాతీయ శతాధిక కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా అతిథులు శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వీసీ మాట్లాడుతూ విశ్వజనీన ఆలోచనలతో సమాజ హితం కోసం కవులు రచనలు సాగించాలని కోరారు. సమాజ శ్రేయస్సు కోసం ఉపయోగపడే రచనలను ఇతర భాషల్లోకి అనువాదం చేసి తెలుగువారి గొప్పతనాన్ని చాటాలన్నారు. శ్రీశ్రీ కళావేదిక సీఈవో కత్తిమండ ప్రతాప్ మాట్లాడుతూ భారతదేశంతో పాటు ప్రపంచంలోని అనేక దేశాల్లో సాహిత్య సదస్సులు నిర్వహించామన్నారు. ప్రతినెలా కవి సమ్మేళనం నిర్వహిస్తూ ప్రస్తుతం 141వ సదస్సును నన్నయ వర్సిటీలో జరిపామన్నారు. త్వరలో మలేషియాలో అంతర్జాతీయ తెలుగు సాహిత్య సదస్సు నిర్వహిస్తామని చెప్పారు. సదస్సు కన్వీనర్ తరపట్ల సత్యనారాయణ మాట్లాడుతూ యువతలో తెలుగు సాహిత్యాన్ని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో శ్రీశ్రీ కళావేదిక నిర్వహిస్తున్న కార్యక్రమాలు తెలిపి అభినందించారు. అనంతరం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కవులు తమ రచనలను, కవితలను వినిపించారు. కార్యక్రమంలో నన్నయ రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, డీన్ ఆచార్య కె.శ్రీరమేష్, ప్రిన్సిపాల్ డి.జ్యోతిర్మయి, శ్రీశ్రీ కళావేదిక జాతీయ కన్వీనర్ కొల్లి రమాదేవి, సభ్యులు టి.పార్థసారధి, అద్దంకి రాజా, పీవీబీ సంజీవరావు పాల్గొన్నారు.

ముగిసిన జిమ్నాస్టిక్స్ పోటీలు



జిమ్నాస్టిక్ పోటీల్లో రాష్ట్రస్థాయిలో ఎంపికైన విజేతలు

కాకినాడఅర్బన్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మూడురోజులుగా కాకినాడ డీఎస్‌ఏ మైదానంలో జరుగుతున్న అంతర్‌జిల్లాల ఏఎస్‌జీఎఫ్ జిమ్నాస్టిక్స్ పోటీలు శనివారంతో ముగిశాయి. వందలాది మంది క్రీడాకారులు హాజరవ్వగా అండర్14, 17,19 విభాగాల్లో బాలబాలికలకు పోటీలు నిర్వహించినట్టు పాఠశాలల క్రీడాసమాఖ్య జిల్లా కార్యదర్శి ఎల్.జార్జి తెలిపారు. విజేతలకు పతకాలను ముఖ్యఅతిథులు అందించారన్నారు. వివిధ విభాగాల్లో విజేతలైనవారిని జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేశామన్నారు. డీఎస్డీవో బి.శ్రీనివాసకుమార్, జిమ్నాస్టిక్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్య క్షుడు విఠల్, పరిశీలకుడు పూర్ణచంద్రరావు, పీఈటీసంఘ జిల్లా కార్యదర్శి సునీల్, జిమ్నాస్టిక్స్ కోచ్ సురేష్, సంయుక్త కార్యదర్శి సునీల్ పాల్గొన్నారు.

పోటీల్లో పాల్గొనడమే ఒక విజయం: డీఈవో



క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు పోటీల్లో పాల్గొనడమే ఒక విజయమని జిల్లా విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు అన్నారు. పోటీల్లో మంచి ప్రతిభ చూపించి గెలుపొందడం ద్వారా సాధించిన సర్టిఫికెట్లు ప్రభుత్వ ఉద్యోగాన్ని సాధించేందుకు ఉపకరిస్తాయని పేర్కొన్నారు. శనివారం రాజమహేంద్రవరంలోని ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడామైదానంలో రెండురోజులపాటు జరిగే 68వ అండర్-17 బాలుర అంతర్‌జిల్లాల బాల్ బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను డీఈవో వాసుదేవరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యానికి ఆటలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. అర్బన్ డీఐ దిలీప్‌కుమార్ మాట్లాడుతూ 13 జిల్లాల నుంచి జట్లు వచ్చాయన్నారు. కార్యక్రమంలో రాష్ట్రస్థాయి పరిశీలకుడు తంబి, స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు ఏవీడీ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి స్వామి, క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

- తొలిరోజున లీగ్ దశలో 12 పోటీలు...

తొలిరోజున పలు జట్ల మధ్య లీగ్ దశలో పోటీలు జరిగాయి. మొత్తం 12 మ్యాచ్‌లు నిర్వహించారు. మరో మూడు మ్యాచ్‌లు జరగాల్సి ఉండగా సమయం లేకపోవడంతో ఆదివారం ఉదయం 7 గంటల నుంచి వీటిని నిర్వహించనున్నారు. అనంతరం నాకౌట్ పోటీలు ప్రారంభమవుతాయి. లీగ్, నాకౌట్ దశల్లో గెలుపొందిన జట్టు క్వార్టర్స్, సెమీఫైనల్స్, ఫైనల్స్‌లో పోటీ పడతారని జిల్లా అధ్యక్షుడు ఏవీడీ ప్రసాద్ తెలిపారు.

తూర్పులక్ష్మీపురంలో విషాదఛాయలు

- మృతదేహాలు లభ్యం
- బాధిత కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే సత్యప్రభ



మృతుల కుటుంబాలను ఓదారుస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ

ఏలేశ్వరం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కుటుంబానికి అందివచ్చిన వ్యక్తులు మృత్యువాత పడటంతో ఆ కుటుంబంలో విషాదం ఏర్పడింది. పెద్దదిక్కుగా ఉన్న తండ్రీకొడుకులు మృతి చెందడంతో కుటుంబసభ్యులు విషాదంలో మునిగిపోయారు. కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలం తూర్పులక్ష్మీపురం గ్రామానికి చెందిన వీరమళ్ల భూషణం, జయబాబు, చింతా శ్రీనివాస్, అల్లుడు చిన గొంతియ్య ఇంటి నిర్మాణం కోసం అడ్డతీగల మండలం బొంగరాలపాడు వెళ్లిన విషయం తెలిసిందే. వారు నలుగురు ప్రమాదశాత్తు వాగులో మృతి చెందడంతో కుటుంబ సభ్యులు విషాదంలో ఉన్నారు. తూర్పులక్ష్మీపురంలో బాధిత కుటుంబాలను శనివారం ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ పరామర్శించి కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఇటువంటి ఘటన జరగడం చాలా బాధాకరమన్నారు. సీఎం సహాయనిధి నుంచి మృతులు ఒక్కొక్కరికీ రూ.5లక్షలు చొప్పున ప్రభుత్వం తరుపున ఎక్స్‌గ్రేషియా ఎమ్మెల్యే సత్యప్రభ ప్రకటించారు. సీఎం చంద్రబాబుతో మాట్లాడి మృతుల కుటుంబంలో ఒక్కరికి ప్రభుత్వ ఉద్యోగం వచ్చేలా కృషి చేస్తానన్నారు. ప్రభుత్వం తరుపున ఎటువంటి సహాయ సహకారాలు కావాలన్నా అండగా ఉంటామన్నారు. ఏలేరులో ఇసుక తవ్వకాలు చేపడుతున్నవారికి ప్రమాదకరమైన ప్రదేశాలు ఉంటే అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు.

మరో రెండు మృతదేహాలు లభ్యం

గల్లంతైన నలుగురిలో శుక్రవారం వీరమళ్ల జయబాబు, చిన గొంతియ్య మృతదేహాలు వెలికి తీశారు. మిగిలిన వీరమళ్ల భూషణం, చింతా శ్రీనివాస్ మృతదేహాలు శనివారం లభ్యమయ్యాయి. అంత్యక్రియలు చేపట్టేందుకు కుటుంబ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు.

నవోదయ ప్రవేశానికి గడువు పెంపు

పెద్దాపురం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురంలోని జవహర్ నవోదయ విద్యాలయ 2025-26 విద్యా సంవత్సరానికి 9, 11వ తరగతుల్లో ప్రవేశానికి మరోసారి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకునేందుకు గడువును ఈనెల 19వరకూ పెంచినట్లు విద్యాలయ ప్రిన్సిపాల్ రామకృష్ణయ్య ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే 2.11.24 నుంచి 21.11.24 తేదీల్లో దరఖాస్తుల్లో తప్పులను సవరించుకోవచ్చని పేర్కొన్నారు. ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

అన్నదాన ట్రస్టుకు రూ.1,01,116 విరాళం



దాతను సత్కరిస్తున్న ఈవో

అయినవిల్లి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌కు చెందిన శ్రీరామమూర్తి కుటుంబ సభ్యులు శ్రీసిద్ధివినాయకస్వామిని దర్శించుకుని అన్నప్రసాద ట్రస్టుకు రూ.1,01,116 విరాళం అందించారు. వీరికి ఆలయ ప్రధానార్చకుల ఆధ్వర్యంలో వేదాశీర్వచనం అందజేశారు. ఆలయ ఈవో ముదునూరి సత్యనారాయణరాజు దాతను అభినందించిన శేషవస్త్రంతో సత్కరించి స్వామివారి చిత్రపటాన్ని బహూకరించారు.

గ్రామాల్లో సర్వే

మలికిపురం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రీ సర్వే ప్రాజెక్టులో భాగంగా మలికిపురం మండలంలో విశ్వేశ్వరాయపురం, మట్టపర్రు గ్రామాల్లో ఈ నెల 11న సర్వే గ్రామసభలు నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ టి.శ్రీనివాసరావు తెలిపారు. గ్రామంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొనాలని కోరారు.

విగ్రహాల ఏర్పాటు

కె.గంగవరం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): కుందూరు ఉన్నత పాఠశాల ఆవరణలో వినాయకుడు, సరస్వతీ దేవి విగ్రహాలను ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన వాసంశెట్టి సాయిత్రినాథ్, కావ్య, సందీప్‌లు వీటిని ఏర్పాటు చేయించారు. ప్రధానోపాధ్యాయుడు సీహెచ్.ఆదినారాయణమూర్తి, వాసంశెట్టి శ్రీనివాస్, సూర్యకుమారి పాల్గొన్నారు.

అనుమతుల్లేకుండా బోట్స్‌మెన్ ర్యాంపు ప్రారంభం

- ప్రభుత్వ నిబంధనలు బేఖాతారు
- ర్యాంపును అడ్డుకున్న రెవెన్యూ అధికారులు
- సామాన్యుడికి అందని ఉచిత ఇసుక




పి.గన్నవరం లక్ష్విడెక్కు వద్ద బోటు ద్వారా నదీపాయలో ఇసుక తీస్తున్న దృశ్యం, ర్యాంపును అడ్డుకుంటున్న రెవెన్యూ సిబ్బంది

పి.గన్నవరం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఉచిత ఇసుక ఇంకా సామాన్యుడి ఇంటికి చేరలేదు. క్షేత్రస్థాయిలో ఉచిత ఇసుక విధానంపై సరైన స్పష్టత లేకపోవడంతో చుట్టూ వనరులు ఉన్నప్పటికీ ఇసుక అందని ద్రాక్షలా ఉంది. పి.గన్నవరంలో స్థానిక రెవెన్యూ అధికారులకు తెలియకుండానే అక్విడెక్టు వద్ద శ్రీవెంకటేశ్వర శ్యాండ్ అండ్ క్వారి బోట్స్‌మెన్ మరియు పిషర్‌మెన్ కో-ఆపరేటివ్ సొసైటీ సభ్యులు శనివారం బోట్స్‌మెన్ ర్యాంపును ప్రారంభించారు. గోదావరి చెంతనే రెండు రోజులుగా ర్యాంపు పనులు నిర్వహిస్తున్నప్పటికి రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదన్న విమర్శలు ఉన్నాయి. గోదావరి నదీపాయ చెంతనే ఉన్న ఇసుక నిల్వలను ట్రాక్టర్, ఎడ్లబండ్లపై తీసుకోవచ్చని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు ఉన్నప్పటికి పి.గన్నవరంలో మాత్రం అందుకు భిన్నంగా బోట్లు ద్వారా ఇసుకను వెలికి తీస్తున్నారు. బోటుపై తెచ్చిన ఇసుక ఖరీదు సుమారుగా ర్యాంపులో రూ.వెయ్యి దాటే ఉంటుంది. అక్కడ నుంచి ట్రాక్టరు కిరాయి అదనం కావడంతో లబ్ధిదారుడిపై అదనపు భారం పడుతోంది. అంతే కాకుండా ర్యాంపు నిర్వహణ చేస్తూ ప్రభుత్వం విధివిధానాలకు తూట్లు పొడుస్తున్నారు. ఆర్ఐ వర్మ, స్థానిక వీఆర్వో కోరుకొండ శ్రీనులను తహశీల్దార్ అప్రమత్తం చేసి మధ్యాహ్నం ర్యాంపులో ఉన్న ట్రాక్టర్లను బయటకు పంపే ఏర్పాటు చేశారు. కొద్ది క్షణాల్లోనే ఖాళీ ట్రాక్టర్లలో ఇసుకను లోడ్ చేశారు. మరి కొంత సేపటికి (సాయంత్రం) అధికారుల ఆదేశాలు పక్కనపెట్టి నిర్వాహకులు మళ్లీ ఇసుకను లోడు చేశారు. దీంతో లోడైన ట్రాక్టర్లను రెవెన్యూ సిబ్బంది అడ్డుకుని కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. స్థానిక సచివాలయంలో దరఖాస్తు చేసుకుంటే స్థానిక అధికారులు పరిశీలన చేసి అనుమతి పత్రం అందిస్తారు. దీంతో గోదావరి చెంతనే ఉన్న ఇసుక నిల్వల నుంచి ఇసుకను తరలించుకోవచ్చు. కానీ ఏవిధమైన అనుమతి లేకుండానే సొసైటీ సభ్యులు ర్యాంపును ప్రారంభించడంపై పెద్ద నాయకుల పాత్ర ఉన్నట్లు స్థానిక ప్రజానీకం నుంచి విభిన్న స్వరాలు వినిపిస్తున్నాయి.

ర్యాంపులకు అనుమతులు లేవు

తహశీల్దార్ పి.శ్రీపల్లవి

మండలంలోని బోట్స్‌మన్ ర్యాంపులకు అనుమతులు లేవు. ప్రభుత్వం నిర్దేశించిన సూచనలకు బోట్స్‌మెన్ ర్యాంపులు విరుద్ధం, గోదావరి నదీ తీరాన ఇసుక నిల్వలు ఉంటే స్థానిక సచివాలయం అనుమతితో యంత్రాలు ఉపయోగించకుండా ఇసుకను తరలించుకోవచ్చు. ప్రస్తుతం పి.గన్నవరం బోట్స్‌మెన్ ర్యాంపును అడ్డుకున్నాం. ఎస్ఐ బి.శివకృష్ణకు కూడా ఆదేశాలు ఇచ్చాం.

వసతిగృహాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి

- మలికిపురం ఏఎఫ్‌డీటీ విద్యా సంస్థలను ప్రభుత్వంలో విలీనం చేయాలి
- ఏఐఎస్ఎఫ్ జిల్లా మహాసభలో డిమాండ్



ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థుల భారీ ర్యాలీ

అమలాపురం టౌన్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సాంఘిక సంక్షేమ వసతిగృహాల్లో పూర్తిస్థాయి మౌలిక సదుపాయాలు కల్పించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బందెల నాసర్‌జీ డిమాండ్ చేశారు. జీవో నంబరు 77ను గత వైసీపీ ప్రభుత్వం తీసుకురావడంతో రాష్ట్రంలో 70వేల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు పీజీ విద్యకు దూరమవుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. యువగళం పాదయాత్రలో ప్రస్తుత విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ జీవో నంబరు 77ను రద్దు చేస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. అఖిల భారత విద్యార్థి సమాఖ్య జిల్లా ప్రథమ మహాసభ అమలాపురం ప్రెస్‌క్లబ్‌లో శనివారం నిర్వహించారు. ఏఐఎస్ఎఫ్ పతాకాన్ని జె.ఏసురాజు ఆవిష్కరించారు. ప్రజానాట్య మండలి కళాకారులు అభ్యుదయ గీతాలను ఆలపించారు. ఈసందర్భంగా జరిగిన సభలో సీపీఐ జిల్లా కార్యదర్శి కొప్పుల సత్తిబాబు, ఏఐఎస్ఎఫ్ మాజీ రాష్ట్ర నాయకుడు దేవ రాజేంద్రప్రసాద్ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఏఐఎస్ఎఫ్ నిరంతరం పోరాటం సాగిస్తుందన్నారు. తొలుత ఈదరపల్లి వంతెన వద్ద నుంచి గడియార స్తంభం సెంటర్ వరకు వందలాది మంది విద్యార్థులు ఏఐఎస్ఎఫ్ పతాకాలను చేతబూని భారీ ర్యాలీ నిర్వహించారు. జిల్లా మహాసభలో భాగంగా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లాశాఖ అధ్యక్షుడిగా కె.వెంకట్, కార్యదర్శిగా జి.రవికుమార్, ఉపాధ్యక్షులుగా వెన్నెల, సతీష్, సందీప్, సహాయ కార్యదర్శులుగా సాయిరామ్, భానుకార్తీక్, రషీద్, కోశాధికారిగా లావణ్యను ఎన్నుకున్నారు. ఏసుదాసు, రామకృష్ణ, కొండలరావు, శామ్యూల్ తదితర మాజీ విద్యార్థి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీఎస్ఆర్, డెవలప్‌మెంట్ ఫండ్ పనులకు శ్రీకారం



మట్లాడుతున్న మల్లాడి

యానాం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): యానాంలో చమురు సంస్థల నుంచి సీఎస్ఆర్, డెవలప్‌మెంట్ ఫండ్ పనులకు శ్రీకారం చుట్టారు. శనివారం పార్టీ నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో పుదుచ్చేరి ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు మాట్లాడారు. తాను ప్రజాప్రతినిధిగా ఉండగా సీఎస్ఆర్, ఓఎన్‌జీసీ డెవలప్‌మెంట్ ఫండ్ పేరుతో అభివృద్ధి పనులకు పుదుచ్చేరి సీఎస్ఆర్ కమిటీ చైర్మన్ సీఎం, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఓఎన్‌జీసీ అధికారులు పనులకు ఆమోదం తెలిపారన్నారు. అప్పట్లో ఎన్నికలు రావడంతో పనులు నిలిచిపోయ్యాయన్నారు. గత పనులు రద్దు చేయాలని, కొత్త ప్రతిపాదనలు ఉన్నాయని స్థానిక ప్రజాప్రతినిధి ఎన్నో అడ్డంకులు సృష్టించారని మల్లాడి ఆరోపించారు. ఒకసారి సీఎస్ఆర్ కమిటీలో ఆమోదం తెలిపితే మళ్లీ మార్చేందుకు వీలు లేదన్నారు. మళ్లీ కమిటీ ఆమోదం తెలపాలన్నారు. అయితే తన హయాంలో ఆమోదం తెలపడంతో, ఆ పనులు తన సమక్షంలో ప్రారంభించేందుకు సీఎం ఉత్తర్వులు జారీ చేశారని మల్లాడి అన్నారు. ఈపనుల ప్రారంభానికి స్థానిక ప్రజాప్రతినిధిక హాజరైనా తనకు ఎటువంటి అభ్యంతర లేదని సీఎంకు వివరించానని మల్లాడి చెప్పారు. ఈనెల 14వ తేదీన ఐదు అభివృద్ధి పనులకు భూమిపూజ చేశామన్నారు. మిలిగిన పనులకు త్వరలోనే భూమిపూజ చేస్తామన్నారు. ముఖ్యంగా ఎన్ని అడ్డంకులు సృష్టించినా యానాం అభివృద్ధిని ఎవ్వరూ ఆపలేరన్నారు. ఇంకా పెండింగ్ ఉన్న అన్ని పనులను రానున్న రోజుల్లో పూర్తి చేస్తామన్నారు.

అలంకార ప్రియునికి లక్ష తులసి పూజ



అమలాపురం రూరల్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): బండారులంక బిళ్ల వారి వీధిలో వేంచేసి ఉన్న శ్రీపద్మావతి అలివేలు మంగ సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద స్వామివారి జన్మ నక్షత్రమైన శ్రవణా నక్షత్రం కోటి సోమవారాన్ని పురస్కరించుకుని శనివారం వైభవంగా లక్షతులసి పూజ నిర్వహించారు. కారుపర్తి మల్లేశ్వరరావు శిష్య బృందం ఆధ్వర్యంలో లక్షతులసి పూజ నిర్వహించారు. తొలుత స్వామి, అమ్మవార్లకు ఏకాదశ ద్రవ్యాలతో విశేష అభిషేకాలు, లక్ష కుంకుమార్చన జరిగింది. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన స్వామి, అమ్మవార్లను అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. హోమ పూర్ణాహుతిలో భక్తులు పాల్గొన్నారు. యక్కల సత్యనారాయణ-అనంతలక్ష్మి దంపతుల ఆర్థికసాయంతో అన్నప్రసాద వితరణ నిర్వహించారు. కార్యక్రమంలో ఉప్పుగంటి భాస్కరరావు, శ్రీశ్రీనివాసా బాలమిత్రసంఘం ప్రతినిధులు చింతపట్ల బాబు, బిళ్ల విశ్వేశ్వరరావు, అంకం పెదరాజు, పిల్లి పల్లపరాజు, కొండా సుబ్రహ్మణ్యం, బళ్ల సాయి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష తులసి పూజ

అంబాజీపేట, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ఇసుకపూడి జక్కంశెట్టివారిపాలెంలో కొలువుతీరిన శ్రీభూసమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో సామూహిక లక్షతులసి పూజను శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేపట్టారు. సాయంత్రం దీపోత్సవం, పూర్ణాహుతి, ఉయ్యాల సేవ నిర్వహించారు.అంబాజీపేటకొర్లపాటివారిపాలెంలో ఉన్న శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

నిత్యాన్నదానానికి రూ.50వేలు విరాళం

మామిడికుదురు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి బాలబాలాజీ స్వామి నిత్యాన్నదాన పథకానికి అదే గ్రామానికి చెందిన పాటి త్రిమూర్తులు రూ.50,500 విరాళంగా అందించారు. వీరికి ఆలయ అర్చకులు వేదాశ్వీచనం అందించి ప్రత్యేక పూజలు నిర్వహింపచేశారు. అనంతరం స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను సిబ్బంది అందించారు. కార్యక్రమంలో బొక్కా సత్యంమూర్తి, మొల్లేటి రమేష్, మొల్లేటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సోషల్ మీడియా ప్రతినిధులపై కేసులు.. వైసీపీ నిరసన

అక్రమ కేసులు బనాయించారని జిల్లా ఎస్పీ కృష్ణారావుకు ఫిర్యాదు



జిల్లా పోలీసు కార్యాలయం వద్దకు చేరుకున్న వైసీపీ జిల్లా అధ్యక్షుడు విశ్వరూప్, ఎంపీ బోస్, ఎమ్మెల్సీలు

అమలాపురం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 15వేల మంది వైసీపీ సోషల్ మీడియా ప్రతినిధులపై అక్రమ కేసులు బకాయించి వేధింపులకు గురి చేస్తున్నారని కోనసీమ జిల్లా వైసీపీ నేతలు నిరసన వ్యక్తం చేశారు. జిల్లా ఎస్పీ కార్యాలయం వద్ద వైసీపీకి చెందిన మాజీ మంత్రి, జిల్లా పార్టీ అధ్యక్షుడు పినిపే విశ్వరూప్, ఎంపీ పిల్లి సుభాష్‌చంద్రబోస్, ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్, మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు, మాజీ ఎమ్మెల్యేలు చిర్ల జగ్గిరెడ్డి, పొన్నాడ సతీష్‌కుమార్‌తో పాటు జిల్లాలోని పార్టీ నేతలైన ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, జడ్పీటీసీలు గెడ్డం సంపదరావు, పందిరి శ్రీహరి, మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, పార్టీ నాయకులు కుడుపూడి భరత్‌భూషణ్, చెల్లుబోయిన శ్రీనివాస్, కుడుపూడి బాబు, దంగేటి రుద్రతో పాటు వివిధ ప్రాంతాలకు చెందిన అనేక మంది కీలక నాయకులు ఎస్పీ కార్యాలయం వద్ద కొద్దిసేపు నిరసన తెలిపారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జిల్లా ఎస్పీ బి.కృష్ణారావుకు మాజీ మంత్రి విశ్వరూప్ ఆధ్వర్యంలో అందజేశారు. మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత జగన్, ఆయన సతీమణి భారతిలపై టీడీపీ సోషల్ మీడియా అసభ్య పదజాలంతో పోస్టులు పెట్టి మానసిక క్షోభకు గురిచేస్తున్నప్పటికీ పోలీసు యంత్రాంగం అసలు పట్టించుకోని తీరుపై వైసీపీ నేతలు నిరసన వ్యక్తంచేశారు. టీడీపీ ప్రభుత్వం ఇదే పంథా కొనసాగిస్తే వైసీపీ రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమంచేపడుతుందని హెచ్చరించారు.

కోకోనట్ పార్కుకు సహకరించండి



మలికిపురం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): తూర్పుపాలెంలో కోకోనట్ పార్కు ఏర్పాటుకు అన్నివర్గాల ప్రజలు సహకరించాలని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పిలుపునిచ్చారు. తూర్పుపాలెం సీసీఎఫ్ సొసైటీ కార్యాలయంలో శనివారం జరిగిన మహాజన సభలో ఆయన మాట్లాడుతూ కోకోనట్ పార్కును ఏర్పాటు చేస్తే ఈప్రాంత ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. కొబ్బరి ఉప ఉత్పత్తులు ద్వారా కొబ్బరికి గిట్టుబాటు ధరతో రైతులకు మేలు జరగడంతో పాటు యువతకు ఉపాధి అవకాశాలు వస్తాయన్నారు. గుండుబోగుల పెద్దకాపు, సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

అందరికీ తాగునీరు

నియోజకవర్గంలో ప్రజలందరికీ తాగునీరు సక్రమంగా అందించడమే ధ్యేయమని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. కత్తిమండలో శనివారం ఓఎన్జీసీ నిధులతో నిర్మించిన 40వేల లీటర్ల కెపాసిటీ గల వాటర్ ట్యాంకును ప్రారంభించి ప్రజలకు కుళాయి ద్వారా తాగునీరు అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ఎన్నికల ప్రచారంలో కొన్ని గ్రామాల్లో తాగునీటి సమస్యలు గుర్తించి కలత చెందానన్నారు. ఆ రోజు నుంచే ప్రజలందరికీ సక్రమంగా తాగునీరు అందించే చర్యలకు శ్రీకారం చుట్టానన్నారు. గుడిమెళ్లంకలో ఓఎన్జీసీ సహకారంతో రూ.5కోట్లతో ఫిల్టర్‌ను ఏర్పాటు చేస్తున్నామని, మరో రెండు లైన్ల ద్వారా తాగునీరు అందించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎంవీ సత్యవాణి, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ పెద్దకాపు, సర్పంచ్ ఆరేటి రంగ, ఎంపీటీసీ చిట్టాల శ్రీను, గెడ్డం మహాలక్ష్మిప్రసాద్, బోనం సాయి, మల్లిపూడి సత్తిబాబుపాల్గొన్నారు.

యానాంలో రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం



యానాం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): యానాంలో పుదుచ్చేరి రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. స్థానిక జీఎంసీ బాలయోగి క్రీడామైదానంలో పోటీలు నిర్వహించారు. స్థానిక వైఎస్ఆర్ స్టేడియంలో ప్రాంతీయ విద్యాశాఖాధికారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, ప్రాంతీయ పరిపాలనాధికారి మునిస్వామి హాజరై పోటీలను ప్రారంభించారు. ఖోఖో, బాస్కెట్‌బాల్, బాల్‌బ్యాడ్మింటన్, పుదుచ్చేరి, కారైకాల్, మహే, యానాం నుంచి ఎనిమిది జోన్లకు సంబంధించి 500మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే గొల్లపల్లి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ క్రీడా స్ఫూర్తితో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు అందరూ చేరుకోవాలని అన్నారు. పోటీలను ఆర్గనైజింగ్ సెక్రటరీ వీవీఎస్ ప్రకాష్, వి.సాన్యాసిరావు, చింతా వెంకన్న, స్వామి తదితరులు పర్యవేక్షిస్తున్నారు. తొలిరోజు జరిగిన వివిధ పోటీల్లో క్రీడాకారులు ప్రతిభ కనబరిచి సెమీ ఫైనల్‌కు చేరారు. వీటిలో బాస్కెట్‌బాల్‌లో జోన్-2(పుదుచ్చేరి), జోన్-8(యానాం), ఖోఖోలో జోన్-2(పుదుచ్చేరి), జోన్-4(పుదుచ్చేరి) సెమీ ఫైనల్‌కు చేరాయి. బాల్‌బాడ్మింటన్ జోన్-8 (యానాం), జోన్-4(పుదుచ్చేరి) ఫైనల్‌కు చేరారు. ఆదివారం బాస్కెట్‌బాల్, ఖోఖో పోటీలకు సెమీఫైనల్, ఫైనల్, బాల్‌బ్యాడ్మింటన్ ఫైనల్ పోటీలు జరగనున్నాయి.

ఈటాప్ సాఫ్ట్‌వేర్‌పై వర్కుషాపు

అమలాపురం రూరల్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): భట్లపాలెం బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో ఎస్ఆర్కే ఎనర్జీ సొల్యూషన్స్ ప్రైవేటు లిమిటెడ్ అనుసంధానంతో బీటెక్ నాలుగో సంవత్సరం విద్యార్థులకు ఈ-టాప్ సాఫ్ట్‌వేర్ అనే అంశంపై ఆరు రోజుల పాటు వర్కుషాపు నిర్వహించారు. శనివారం ముగింపు సభ జరిగింది. విద్యార్థుల్లో నైపుణ్యం పెంపొందించడంతో పాటు ఈ-టాప్ సాఫ్ట్‌వేర్ వినియోగాన్ని విద్యార్థులకు నేర్పించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జీవీజీ రామారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పరిపాలనాధికారి జక్కం వెంకటకృష్ణారావు, ఈఈఈ విభాగాధిపతి ప్రొఫెసర్ ఏఎస్ వీజే రాజగోపాల్, టెక్నికల్ ట్రైనర్ డాక్టర్ ఎ.భీమరాజు పాల్గొన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు డాక్టర్ భీమరాజు ప్రశంసా పత్రాలను అందజేశారు.

ప్రజాపోరును విజయవంతం చేయండి: సీపీఎం



ప్రజాపోరు కరపత్రాలు పంపిణీ చేస్తున్న సీపీఎం నాయకులు

ఉప్పలగుప్తం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి ఈనెల15వ తేదీ వరకు నిర్వహించే ప్రజాపోరును విజయవంతం చేయాలని సీపీఎం పిలుపునిచ్చింది. భీమనపల్లి కాలనీలో శనివారం ప్రజాపోరు కరపత్రాలు పంపిణీ చేశారు. మహిళలు, పిల్లలపై జరుగుతున్న అత్యాచారాలు నిరోధించాలని, పెరుగుతున్న ధరలకు కళ్లెం వేయాలని టూఅప్ చార్జీల మాటున పెంచిన విద్యుత్ చార్జీలను తక్షణం తగ్గించాలన్న డిమాండ్లతో ప్రజాపోరుకు రూపకల్పన జరిగిందన్నారు. ఈనెల14న కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. సీపీఎం జిల్లా కన్వీనర్‌కారెం వెంకటేశ్వరరావు, బీర వెంకట్రావు పాల్గొన్నారు.

రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యం

అంబాజీపేట, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): రహదారుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం కల్పిస్తుందని సర్పంచ్ పేరాబత్తుల దొరబాబు అన్నారు. తొండవరంలో ఉపాధి హామీ నిధులు రూ.25లక్షలతో నిర్మిస్తున్న రహదారుల నిర్మాణానికి భూమి పూజ చేశారు.

గ్రంథాలయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షునిగా వర్మ



అమలాపురం టౌన్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా అమలాపురం ప్రథమశ్రేణి శాఖ గ్రంథాలయ అధికారి గాదిరాజు కృష్ణవర్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గ్రంథాలయ సంస్థల ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రతినిధుల సమావేశం కడపలో నిర్వహించారు. అసోసియేట్ అధ్యక్షుడిగా నియమితులైన వర్మను జిల్లాశాఖ అధ్యక్షురాలు రత్నాబాయి అభినందించారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కారానికి కృషి చేయడంతో పాటు గ్రంథాలయాలను మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని వర్మ తెలిపారు.

పార్వతీ గౌతమేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

ముమ్మిడివరం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): అన్నంపల్లిలోని శ్రీపార్వతీ గౌతమేశ్వరస్వామివారికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీకమాసం గోపాష్టమి సందర్భంగా మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన, కుంకుమపూజ, ప్రదోషవేళలో జ్యోతిర్లింగార్చన, స్వామివారికి నీరాజన మంత్రపుష్పం, ఆశీర్వచనం, అన్నసమారాధన నిర్వహించారు. యలమంచిలి సతీష్, పుల్లాపంతులు పవన్‌కుమార్‌శర్మ ఆధ్వర్యంలో 12మంది రుత్వికులతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.

బాలార్జునకు సత్కారం



బాలార్జునను సన్మానిస్తున్న ఆదికవి విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ ఆచార్య శ్రీనివాసరావు

అమలాపురం టౌన్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): తెలుగు భాషా వికాసానికి, అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తున్న మాకే బాలార్జున సత్యనారాయణను ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ ఆచార్య వై.శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ జి.సుధాకర్, డీన్ ఆచార్య కేఎస్ రమేష్ ఘనంగా సత్కరించారు. విశ్వవిద్యాలయం సెమినార్ హాలులో గోదావరి కవనోత్సవం ముగింపు సభలో తెలుగు భాషాభ్యున్నతి కోసం విశేష ప్రచారం సాగిస్తున్న బాలార్జునను సత్కరించారు. కార్యక్రమంలో శ్రీశ్రీకళావేదిక చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్, డాక్టర్ పి.పార్థసారథి, డాక్టర్ తరపట్ల సత్యనారాయణ తదితరులు పాల్గొని ప్రత్యేకంగా అభినందించారు.

ఫ్రెషర్స్ డే వేడుకలు

కాట్రేనికోన, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసా ఇంజనీరింగు కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థుల ఫ్రెషర్స్ డే వేడుకలను శనివారం చైర్మన్ రామచంద్రరాజు, సెక్రటరీ, కరస్పాండెంట్ డీవీఎస్ఎస్ వర్మ ప్రారంభించారు. కళాశాల సాధించిన ప్రగతిని వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసకుమార్, వి.రవీంద్ర, డీఎస్సీ టీఎస్ఆర్‌కే ప్రసాద్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

వేద మంత్రోచ్చారణల మధ్య లక్ష బిల్వార్చన



మామిడికుదురు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మామిడికుదురులో వేంచేసి ఉన్న పార్వతీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో కార్తీకమాసాన్ని పురస్కరించుకుని లక్ష బిల్వార్చన పూజా కార్యక్రమాన్ని వేద మంత్రోచ్చారణల మధ్య శనివారం ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన ఈలి శ్రీనివాస్-మంగతాయారు దంపతుల ఆధ్వర్యంలో పలువురు భక్త దంపతులు కర్తలుగా పాల్గొని పూజా కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు చంద్రమౌళి భాస్కర్ ఆధ్వర్యంలో ఈదరాడ గ్రామానికి చెందిన బ్రహ్మశ్రీ పూజ్యం జగన్నాథశర్మ పర్యవేక్షణలో విఘ్నేశ్వరపూజ, రామలింగేశ్వరుడికి పంచామృతాలు, లక్ష మారేడు దళాలతో అభిషేకాలు, పార్వతీ దేవికి లక్ష కుంకుమార్చన పూజా కార్యక్రమాలను ఘనంగా చేశారు. అనంతరం నీరాజన మంత్రపుష్పం, సూర్య నమస్కారాలు, చండీ హోమం, రుద్ర హోమం ఘనంగా నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు

ముమ్మిడివరం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం నగర పంచాయతీ పల్లిపాలెంలోని శ్రీహరి సాకేత వేంకటేశ్వరస్వామి ఆలయం శనివారం భక్తులు పోటెత్తారు. కార్తీకమాసం శనివారం కావడంతో అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఆదిత్య అర్చకుడు ఆదిత్యశర్మ ఆధ్వర్యంలో స్వామివారికి విశేష పూజలు జరిపించారు. ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు దంపతులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు పెన్మెత్స చిట్టిరాజు ఆధ్వర్యంలో అర్చకుల ఎమ్మెల్యే దంపతులకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి చిత్రపటాన్ని ఎమ్మెల్యేకు బహూకరించారు. ఈసందర్భంగా భారీ అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయమంతా భక్తులతో పోటెత్తింది. ఎమ్మెల్యే వెంట టీడీపీ నాయకులు గుత్తుల సాయి, చెల్లి అశోక్, దొమ్మేటి రమణకుమార్ ఉన్నారు.

వైభవంగా శ్రీవారి పవిత్రోత్సవాలు

అయినవిల్లి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): నల్లచెరువులో గల పద్మావతీ, గోదాదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి పవిత్రోత్సవాలను వైఖానస ఆగమోక్తముగా తిరుమల సంప్రదాయాన్ని అనుసరిస్తూ వైభవంగా నిర్వహిస్తున్నారు. విశ్వక్సేనరాధన, పుణ్యాహవచనం, అగ్ని ప్రణయము, ప్రధాన కుంభారాధన, ఉత్సవమూర్తి స్నపనం, పవిత్ర సమర్పణ, తీర్థ ప్రసాత వితరణ, భగవత్ ప్రార్థన, ఆచార్య స్తుతి నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో గణేశుల వెంకటేశ్వరరావు దంపతులు, వంశీవికాస్ దంపతులు, భక్తులు పాల్గొన్నారు.

లక్ష్మీ వేంకటేశ్వరునికి శ్రవణ నక్షత్ర పూజలు

అల్లవరం, నవంబరు9(ఆంధ్రజ్యోతి): బంగారు తిరుపతిగా పేరొందిన బెండమూర్లంకలో శ్రవణ జన్మనక్షత్ర సందర్భంగా లక్ష్మీవేంకటేశ్వరునికి శనివారం పూజలు నిర్వహించారు. కార్తీకమాసం సందర్భంగా సుంకర కళ్యాణ్-శ్వేత దంపతులు స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు జరిగాయి.

104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

అంతర్వేది, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): 104 ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం వారి డిమాండ్లను పరిష్కరించాలని రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు సఖినేటిపల్లి తహశీల్దార్, ఎంపీడీవో, అధికారులకు శనివారం వినతి పత్రం అందించారు. 104 ఉద్యోగులు పైలెట్ విజయ్, డీఈవోలు రుద్రప్రసాద్, సీఈవోలు వినతిపత్రం అందించినట్టు తెలిపారు. మూడు నెలలుగా జీతాలు రావడం లేదని వారి ఆర్థిక పరిస్థితి అంతకంతకు బలహీనపడుతుందన్నారు. 2020 తర్వాత విధుల్లో చేరిన డ్రైవర్, డీఈవోలకు జీవో నంబరు 7 ప్రకారం వేతనాలు ఇవ్వాలని కోరారు. అరబిందో యాజమాన్యం అక్రమంగా వసూలు చేసిన పీఎఫ్ తిరిగి చెల్లించాలన్నారు. 74 మంది సీనియర్ డ్రైవర్లకు శ్లాబ్ ప్రకారం జీతాలు చెల్లించాలన్నారు. డీఎస్సీ ద్వారా నియమితులైన సీనియర్ డ్రైవర్లను కాంట్రాక్టులో పెట్టాలని, ఉద్యోగులకు మెడికల్ ఇన్సూరెన్సు చేయించి రావాల్సిన బకాయిలు చెల్లించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుని 104 ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరారు.

పార్టీ సభ్యత్వాల నమోదును వేగవంతం చేయాలి

మలికిపురం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలని జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు ముదునూరి చినబాబురాజు పిలుపునిచ్చారు. గతంలో 40వేలు వరకు సభ్యత్వాలు ఉన్నాయని, ఈ సారి 50వేలు దాటి చేయాలన్నారు. ఈసందర్భంగా ఆయన సభ్యత్వాన్ని తీసుకున్నారు. పార్టీ మండల అధ్యక్షుడు ముప్పర్తి నాని, అడబాల యుగంధర్, గుబ్బల శ్రీనివాస్, పార్టీ కార్యదర్శులు రాపాక నవరత్నం, తాడి సత్యనారాయణ, చాగంటి స్వామి, గోనిపాటి రాజు, జాన పార్వతీశం, చెల్లుబోయిన జయసూర్యబాబు, జిల్లెల్ల బాబుప్రసాద్ పాల్గొన్నారు.

ముంగండలో టీడీపీ సభ్యత్వ నమోదు

పి.గన్నవరం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వాల నమోదును వేగవంతం చేయాలని టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు షేక్ సుభాన్ తెలిపారు. ముంగండలో జరిగిన పార్టీ సభ్యత్వాల నమోదు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గ్రామంలో పలువురు మహిళా కార్యకర్తలతో సభ్యత్వం నమోదు చేయించారు. కోఆర్డినేషన్ కమిటీ నియోజకవర్గ కో-కన్వీనర్ దాసరి వీరవెంకటసత్యనారాయణ, పార్టీ మండల అధ్యక్షుడు తోలేటి సత్తిబాబు, మాజీ ఎంపీపీ అంబటి భూలక్ష్మి, నాయకులు నంసాని పెద్దిరాజు, యండ్ర శ్రీనివాసరావు, పెచ్చెట్టి వెర్రియ్య, పితాని రాంబాబు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటుకు 2,250 దరఖాస్తులు

అంబాజీపేట, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఓటు కోసం మండలంలో 2,250మంది పట్టభద్రులు దరఖాస్తు చేసుకున్నట్లు తహశీల్దారు జె.వెంకటేశ్వరి తెలిపారు. ఈనెల6వ తేదీ వరకూ ఆన్‌లైన్‌ద్వారా 1,287మంది దరఖాస్తు చేసుకోగా ఎంపీడీవో, విద్యాశాఖా కార్యాలయం ద్వారా 963 ధరఖాస్తులు వచ్చాయన్నారు. వీటిని ఆయా పోలింగ్ కేంద్రాల బీఎల్వోలకు విచారణ నిమిత్తం పంపించామన్నారు. శని, ఆదివారాల్లో మండలంలోని ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు.

మహిళలకు ప్రత్యేక చట్టాలు

అంబాజీపేట, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మహిళలకు ప్రత్యేక చట్టాలు ఉన్నాయని, అపరిచిత వ్యక్తుల పట్ల మహిళలు మోసపోకుండా అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ కె.చిరంజీవి సూచించారు. మహిళా సంరక్షణపై స్థానిక హైస్కూల్‌లో హెచ్‌ఎం కడలి సాయిరామ్ అధ్యక్షతన నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. సదస్సులో ఉపాధ్యాయులు వి.సత్యనారాయణ, ఎల్.పూర్ణిమ, ఫణికుమార్, మహిళాపోలీసులు భవాని, దుర్గ, మాధురి, విద్యార్థులు పాల్గొన్నారు.

భవనం పైనుంచి పడి తాపీమేస్త్రి మృతి

మామిడికుదురు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): భవనం పైనుంచి పడి తాపీమేస్త్రి మృతి మృతిచెందాడని నగరం ఎస్ఐ ఎ.చైతన్యకుమార్ తెలిపారు. పాశర్లపూడికి చెందిన మల్లవరపు ఆనందరావుకు చెందిన భవనం మూడో అంతస్తులో శుక్రవారం అప్పనపల్లి గ్రామానికి చెందిన తోట సత్యసాయిబాబు(40) నిర్మాణ పనులు చేస్తున్నాడు. ప్రమాదవశాత్తు సాయంత్రం భవనం కిందపడిపోవడంతో తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతిచెందినట్టు ఎస్ఐ తెలిపారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

డీజిల్ తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

ముమ్మిడివరం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): డీజిల్‌ను ఆటోలో అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని ఎస్ఐ అదుపులోకి తీసుకుని డీజిల్‌ను, ఆటోను స్వాధీనం చేశారు. శనివారం వాహనాల తనిఖీలో భాగంగా అన్నంపల్లి టోల్‌గేట్ వద్ద ముమ్మిడివరం ఎస్ఐ డి.జ్వాలాసాగర్ ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా 330 లీటర్ల డీజిల్‌ను యానాం నుంచి ఆటోలో తరలిస్తున్న భీమవరానికి చెందిన గాడా సురేష్ అరెస్టుచేసి, డీజిల్‌ను, ఆటోను సీజ్ చేశారు.

11న ఉచిత వైద్య శిబిరం

అల్లవరం, నవంబరు9(ఆంధ్రజ్యోతి): కొమరగిరిపట్నంలో క్షత్రియ సేవా సమితి ఆధ్వర్యంలో ఈనెల11న మెగా ఉచిత కంటి వైద్య శిబిరం జరుగుతుందని టీడీపీ ప్రముఖులు దాట్ల గోపిరాజు ఓ ప్రకటనలో తెలిపారు.

60వ రోజుకు చేరిన అధ్యాపకుల నిరసన

మలికిపురం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మలికిపురం డిగ్రీ కళాశాల అధ్యాపకులు చేస్తున్న నిరసన కార్యక్రమం శనివారం 60వ రోజుకు చేరింది. బకాయి పడిన జీతాలను చెల్లించమంటూ నిరసన మొదలుపెట్టిన అధ్యాపకులకు జీతాలు చెల్లించేసి విధుల్లోకి రావద్దని యాజమాన్యం ప్రకటించడంతో అధ్యాపకులు నిరసన వ్యక్తం చేస్తున్నారు

ఐరన్ మాత్రలతో గర్భిణులకు రక్షణ

ఉప్పలగుప్తం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ఐరన్ మాత్రల వాడకం గర్భిణులకు రక్షణ కవచమని భీమనపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి కె.లక్ష్మీప్రసన్న అన్నారు. గర్భిణులు ప్రతిరోజు ఒకటి వంతున 180 ఐరన్ ఫోలిక్ మాత్రలు తీసుకోవాలని సూచించారు. శనివారం ఆసుపత్రిలో గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. పరీక్షల అనంతరం ఆరుగురు గర్భిణులను ఏరియా ఆసుపత్రికి తరలించారు. డాక్టర్ విష్ణుప్రియ, ఆరోగ్య విస్తరణాధికారి రాయుడు రామకృష్ణమూర్తి, పీహెచ్ఎన్ సుభారత్నం, హెచ్‌వీ పి.సత్యవతి పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడు దొరబాబు జన్మదిన వేడుకలు

అల్లవరం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాళ్ల దొరబాబు స్వగృహం బెండమూర్లంకలో జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. జనసేన నాయకులు కటికిరెడ్డి బాబి, కంకిపాటి వీరబాబు, పిల్లా ప్రసాద్, పిండి గణపయ్య, చికిలే చిట్టిబాబు, రేళ్ల శ్రీనివాస్, నల్లా రాము, కరారి సుబ్బారావు తదితరులు దొరబాబుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

ఎమ్మెల్యే పరామర్శ

ముమ్మిడివరం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మాతృవియోగంతో బాధపడుతున్న టీడీపీ అమలాపురం పార్లమెంటరీ అధికార ప్రతినిధి బొక్కా రుక్మిణిని శనివారం ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు పరామర్శించారు. ముమ్మిడివరం నగర పంచాయతీ 13వ వార్డుకు చెందిన బొక్కా రుక్మిణి మాతృమూర్తి సత్యవతి ఇటీవల మృతిచెందారు. శనివారం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుత్తుల సాయి, ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి చెల్లి అశోక్, దొమ్మేటి రమణకుమార్, కట్టా సత్తిబాబు, రెడ్డి సుబ్బారావు, బాలాజీ, గొల్లపల్లి గోపీలతో పాటు పలువురు పరామర్శించారు.

గ్రామాల్లో సర్వే

మలికిపురం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ఆంధ్ర ప్రదేశ్ రీ సర్వే ప్రాజెక్టులో భాగంగా మలికిపురం మండలంలో విశ్వేశ్వరాయపురం, మట్టపర్రు గ్రామాల్లో ఈ నెల 11న సర్వే గ్రామసభలు నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ టి.శ్రీనివాసరావు తెలిపారు. గ్రామంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొనాలని కోరారు.

విగ్రహాల ఏర్పాటు

కె.గంగవరం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): కుందూరు ఉన్నత పాఠశాల ఆవరణలో వినాయకుడు, సరస్వతీ దేవి విగ్రహాలను ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన వాసంశెట్టి సాయిత్రినాథ్, కావ్య, సందీప్‌లు వీటిని ఏర్పాటు చేయించారు. హెచ్ఎం సీహెచ్.ఆదినారాయణమూర్తి, వాసంశెట్టి శ్రీనివాస్, సూర్యకుమారి పాల్గొన్నారు.

సమస్యల చెరలో టిడ్కో గృహాల సముదాయం

● క్షీణించిన పారిశుధ్యం ● చోద్యం చూస్తున్న అధికారులు ● చీకటిపడితే దోమల మోత ● ఇళ్లు చుట్టూ పెరిగిన తుప్పలు ● భయం భయంగా నివాసం ఉంటున్న కాలనీవాసులు




ఇళ్ల మధ్య నిలిచిన మురుగునీరు, టిడ్కోకాలనీ సీసీ రోడ్లుపై కుప్పలుగా పేరుకుపోయిన చెత్త

మండపేట, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మండపేట పట్టణం గొల్లపుంతకాలనీ 20వ వార్డులో ఉన్న టిడ్కో గృహాల సముదాయం సమస్యలకు వేదికంగా మారింది. టిడ్కో గృహాల సముదాయంలో మొత్తంగా 4,064 ఇళ్లు నిర్మించారు. తొలి విడతలో సుమారు 2200 మంది లబ్ధిదారులకు ఇళ్లను అందించారు. తొలి విడతలో ఇంకా 1824 మందికి ఇళ్లను ఇవ్వాల్సి ఉంది. తొలి దశలో ఇచ్చిన ఇళ్ల వద్ద మురుగునీరు బయటకు వెళ్లడం లేదు. ఇళ్ల మధ్య వాడకం నీరు నిలిచిపోవడంతో దోమలు విపరీతంగా వ్యాప్తి చెందుతున్నాయి. మరో పక్క కాలనీలో ఇళ్ల నుంచి వచ్చే చెత్తను తరలించడంలో మున్సిపల్ అధికారులు మీనమేశాలు లెక్కిస్తున్నారు. దీంతో కాలనీలో రోడ్లపై చెత్త కుప్పలు పేరుకుపోయి అపారిశుధ్యం తాండవిస్తోంది. మరోపక్క రెండో దశలో మౌలిక వసతుల పనులు ముందుకు సాగడం లేదు. రెండో దశలో 2064 మందికి ఇళ్లను ఇవ్వాల్సి ఉంది. రెండో దశలో ఇళ్ల నిర్మాణం పూర్తయింది.



రెండో దశలో ఇళ్లను అల్లుకున్న పిచ్చి మొక్కలు

అయితే మౌలిక వసతులు కల్పించాల్సి ఉంది. రెండో దశలో సముదాయంలోని ఇళ్లు పిచ్చి మొక్కలు అల్లుకుని చిట్టడివిని తలపిస్తోన్నాయి. ఇక్కడ ఎస్‌టీపీ పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. ఇలా సమస్యల చెరలోటిడ్కో కాలనీ ఉంది. ఎన్నికల ముందు అధికార, ప్రతిపక్ష పార్టీల నేతలు టిడ్కో కాలనీలో అన్ని వసతులు కల్పించి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఇప్పుడు సమస్యలు పరిష్కరిం చడం లేదని కాలనీవాసులు వాపోతున్నారు. ఏడేళ్ల నుంచి నాడు నేడు అంటూ మౌలిక వస తులు కల్పించకుండా కాలయాపన చేస్తున్నారు. టిడ్కో ఇళ్లనుపూర్తిస్థాయిలో వసతులు కల్పించి అందించాలని లబ్ధిదారులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

హిందూ దేవాలయాలకు స్వయం ప్రతిపత్తి కల్పించాలి

ఏపీ మానవీయ సంఘచాలక్ హరికుమార్‌రెడ్డి



వడయార్ శిల్పాశ్రమంలో హైందవ శంఖారావం కరపత్రాలను ఆవిష్కరిస్తున్న బీజేపీ నాయకులు

కొత్తపేట, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): హిందూ దేవాలయాలను ప్రభుత్వ నియంత్రణ నుంచి విముక్తిచేసి స్వయం ప్రతిపత్తిని కల్పించాలని ఏపీ మానవీయ సంఘచాలక్ ఎం.హరికుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం స్థానిక శిల్పి వడయార్ శిల్పశాలకు విచ్చేసి హైందవ శంఖారావం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ దేవాలయాలను ఉత్తమ ధార్మిక వ్యవస్థగా చట్టసవరణ చేసి స్వయం ప్రతిపత్తి కల్పించాలన్న డిమాండ్‌తో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఒక జాతీయ ఉద్యమానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఇందులో భాగంగా వచ్చే ఏడాది జనవరి 5న హైందవ శంఖారావం పేరిట చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని, ఈశంఖారావానికి హిందూవులంతా లక్షలాదిగా తరలిరావాలన్నారు. హిందూ దేవాలయాలను ప్రభుత్వాలు నిర్వహణ చేయడాన్ని హిందూ విశ్వాలపై తీవ్రమైన దాడిగా భావించాలన్నారు. దేవాలయాల ఆస్తుల విషయంలోను ప్రభుత్వాలు దూరంగా ఉండాలని న్యాయం స్థానాలు స్పష్టమైన తీర్పులు ఇచ్చినప్పటికి దేవాలయాల ద్వారా వచ్చే ఆదాయాన్ని ఇతర అవసరాలకు వినియోగిస్తున్నారని ఆరోపించారు. దేవుడి కోసం ఇచ్చే ప్రతి కానుకను ధర్మప్రచారానికి మాత్రమే ఉపయోగించాలన్నారు. దీని కోసం జాతీయస్థాయిలో చట్టం తేవాలనే ధృడసంకల్పంతో విశ్వహిందూ పరిషత్ విజయవాడలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం, పాలూరి జయప్రకాశ్‌నారాయణ, శిల్పి రాజకుమార్‌వడయార్, మద్దింశెట్టి శ్రీనివాసరావు, కోటిపల్లి సుబ్రహ్మణ్యం, తోరం భాస్కరరావు, ఆదిక్య శివసుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

శోభారాణికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు



రామచంద్రపురం(ద్రాక్షారామ), నవంబరు 9(ఆంధ్రజ్యోతి): స్థానిక కృత్తివెంటి పేర్రాజు పంతులు ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకురాలు డా. కె.వి.శోభారాణి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. ఈమేరకు విద్యాశాఖ డైరెక్టర్ కార్యాలయం నుంచి కళాశాలకు సమాచారం అందచేశారు. శోభారాణి కంప్యూటర్ అప్లికేషన్స్ అధ్యాపకురాలుగా పనిచేస్తున్నారు. ఆమెను ప్రిన్సిపాల్ ఎన్.శ్రీనివాస్, అధ్యాపకులు అభినందించారు.

కృష్ణారెడ్డికి ఉత్తమ అవార్డు



రావులపాలెం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ఈతకోట జడ్పీ హైస్కూల్ హెచ్ఎం కేఎస్ఎస్ కృష్ణారెడ్డి ఫెలో టీచర్ విభాగంలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. ఆయన విద్యార్థుల కోసం సాంఘిక శాస్త్రంలో పుస్తకం రూపొందించారు. 2022లో కోనసీమ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డును అందుకున్నారు. 2023లో సెంటా నిర్వహించిన పరీక్షల్లో ద్వితీయ స్థానం సాధించి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును సాధించారు. దీంతో ఈనెల11న విజయవాడలో కృష్ణారెడ్డి అవార్డును అందుకోనున్నారు.

సురేష్‌రెడ్డికి ఉత్తమ అవార్డు



రావులపాలెం, నవంబరు9(ఆంధ్రజ్యోతి): రావులపాలెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జువాలజీ అధ్యాపకుడిగా పనిచేస్తున్న డాక్టర్ నల్లమిల్లి సురేష్‌రెడ్డి ఉత్తమ అధ్యాపకుడిగా ఎంపికయ్యారు. ధవళేశ్వరం బ్యారేజీ వద్ద చేపల జీవ వైవిధ్యంపై ఆయన పీహెచ్‌డీ చేశారు. విద్యా రంగానికి ఎనలేని సేవలు చేశారు. దీంతో ఈ అవార్డుకు ఎంపికయ్యారు. ఈనెల11న విజయవాడలో జరిగే కార్యక్రమంలో అవార్డును అందుకోనున్నారు.




గంగవరం శివాలయంలో పూజలు చేస్తున్న మంత్రి సుభాష్. పక్క చిత్రంలో గంగవరం శివాలయంలో పూజలు చేస్తున్న రుత్వికులు

శివాలయంలో మంత్రి సుభాష్ పూజలు

కె.గంగవరం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): కె.గంగవరంలోని అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో శనివారం లక్షపత్రి పూజ జరిపారు. తొలుత స్వామివారికి గ్రామోత్సవం, అనంతరం లక్షబిల్వార్చన చేశారు. ఆలయంలో ఉదయం నుంచి స్వామి వారికి అభిషేకాలు జరిపారు. ఈ కార్యక్రమాలకు కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తల్లిదండ్రులతో హాజరయ్యారు. ఆలయ అర్చకులు మంత్రి కుటుంబ సభ్యులకు పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమాల్లో నల్లూరి వెంకట తిరుపతిరాయుడు, అల్లూరి దొరబాబు, నేమాని అబ్బు, తాడాల రాంబాబు, నేమాని సత్యనారాయణమూర్తి, సలాది వెంకన్న, నేమాని ప్రసాద్, వట్టికూటి రామ్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుల త్యాగాలు వెలకట్ట లేనివి



అమరులైన ఉద్యమవీరులకు నివాళులర్పిస్తున్న నాయకులు

మండపేట, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): పీడిత ప్రజలు కోసం పోరాడి అశువులు బాసిన అమరుల త్యాగాలు వెలకట్టలేనివని ఐఎఫ్‌టీయూ నాయకులు అన్నారు. మండపేటలో శనివారం ఐఎఫ్‌టీయూ రైస్‌మిల్లు జట్టు కార్మిక సంఘం ఆధ్వర్యంలో మండపేట ఏడిదరోడ్డులో ఉన్న బస్టాండ్ వద్ద అమరవీరుల సంస్మరణ సభ నిర్వహించారు. కొవ్వొత్తులతో వారికి నివాళులర్పిం చారు. నాయకులు చీకట్ల వెంకటేశ్వరరావు, రైతుకూలీ సంఘ నాయకులు వెంటపల్లి భీమశంకరం మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం పేదల సమస్యలపై పోరాడిన విప్లవోద్యమ నాయక్ను పోరాటం మరువలేమన్నారు. కార్మికుల హక్కులను కాలరాసే ప్రభుత్వాలకు నూకలు చెల్లక తప్పదని వారు హెచ్చరించారు. కార్యక్ర మంలో ఐఎఫ్‌టీయూ, రైతు కూలీ, రైస్‌మిలు కార్మిక సంఘ నాయకులు చింతా రాజారెడ్డి, నల్ల శ్రీను, చల్లా శ్రీను, కె.సత్తిబాబు, గంధం శ్రీను, సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

కపిలేశ్వరపురం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): అంగర పీహెచ్‌సీలో శనివారం గర్భిణులకు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రధానమంత్రి మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా వైద్యాధికారిణి డాక్టర్ రత్నకుమారి 25మంది గర్భిణులను పరీక్షించి వారిలో నలుగుర్ని క్లిష్టతర గర్భిణులుగా గుర్తించి ప్రత్యేక వైద్య సదుపాయం అందజేశారు. ఉచితంగా రక్తపరీక్షలు చేసి మందులు పంపిణీ చేసారు. ఈసందర్భంగా వైద్యాధికారిణి రత్నకుమారి మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవించడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఎంపీహెచ్ఈవో జె.మల్లికార్జునుడు, హెచ్ఈ బి.రామారావు గర్భిణులు తీసుకోవాల్సిన పౌష్టికాహారం తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి



పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వ్యాపారులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం.

రాయవరం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): వ్యాపారులు ఆర్థిక అభివృద్ధి సాధించేందుకు కేంద్ర ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆఫ్ ఇండియా జిల్లా జనరల్ మేనేజర్ పి.శ్రీనివాస్ పిలుపునిచ్చారు. శనివారం చిరు వ్యాపారులకు ఎంఎస్ఎంఈపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రాయవరం బ్రాంచ్ చీఫ్ మేనేజర్ వి.సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జీఎం మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో వ్యాపారులకు చేయూత ఇచ్చేందుకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రత్యేక ప్రోత్సాహకాలను ప్రకటించారన్నారు. వివిధ రకాల వ్యాపారులకు రుణాల మంజూరు సరళతరం చేశామని, వాటిని సద్వినియోగం చేసుకుని వ్యాపారంలో అభివృద్ధి సాధించాలన్నారు. తీసుకున్న రుణాలను సక్రమంగా చెల్లించడం ద్వారా తిరిగి రుణాలను పొందేందుకు వీలు ఉంటుందన్నారు. ఈసందర్భంగా కోనసీమ జిల్లా డీఐసీ విభాగాధిపతి పి.శివరామప్రసాద్, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ కేశవ వర్మ పవర్ ప్రజెంటేషన్ ద్వారా పథకాలకు ఏవిధంగా దరఖాస్తు చేసుకోవాలి తదితర అంశాలపై అవగాహన కల్పించారు. రీజనల్ కార్యాలయ డిప్యూటీ ఆర్‌హెచ్ ప్రసన్నరాజు, రామచంద్రపురం, మండపేట, అనపర్తి నియోజకవర్గాలకు చెందిన చిరు వ్యాపారులు పాల్గొన్నారు.

ర్యాలిలో అయ్యప్పస్వాముల తేటతుల్లి



ర్యాలిలో అయ్యప్పభక్తుల ఊరేగింపు

ఆత్రేయపురం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామంలో శనివారం అయ్యప్పస్వాములు పలు వీధుల్లో జరిపిన ఊరేగింపు ఆకట్టుకుంది. వందలాది స్వాములు తేటతుల్లి జరిపారు. కేరళ వాయిద్యాలు, కోలాట ప్రదర్శన, డోలుసన్నాయి వాయిద్యాలు భక్తులను విశేషంగా ఆకర్షించాయి. వివిధ రకాల పుష్పాలతో అలంకరించిన నెమలి వాహనం, కార్తీకజ్యోతి వాహనం, అయ్యప్పస్వామి వాహనాలు ఆకర్షణీయంగా నిలిచాయి. అయ్యప్ప శరణు ఘోషతో ఊరే గింపు కన్నుల పండువగా జరిపారు. మురళి గురుస్వామి ఆధ్వర్యంలో ఆలయ అర్చకుడు రఘు పాల్గొన్నారు.

వీఆర్వోల నూతన కార్యవర్గం ఎన్నిక



తహశీల్దార్‌ను కలిసిన నూతన కార్యవర్గం సభ్యులు

కె.గంగవరం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): కె.గంగవరం మండల వీఆర్వోల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక శుక్రవారం జరిగింది. సంఘం అధ్యక్షుడిగా మాగాపు వీరభద్రం, కార్యదర్శిగా వానపల్లి వి.వి.సత్యనారాయణ, గౌరవాధ్యక్షుడిగా పామర్తి రామారావు, కార్యదర్శిగా కొమ్ము వెంకటేశ్వరరావు, కోశాధికారిగా దార్ల అమ్మాజీ, సలహాదారు జుత్తుగ రమేష్ కుమార్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యవర్గం తహశీల్దార్ బండి మృత్యుంజయరావును కలిసి సంఘం ఏర్పాటు గురించి వివరించారు.



చాగంటిని అభినందిస్తున్న సతీష్‌రావు

ప్రవచనకర్త చాగంటిని అభినందించిన సతీష్‌రావు

ద్రాక్షారామ, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): నైతిక విలువల సలహాదారుడిగా నియమితులైన ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావును ద్రాక్షారామ నాటక కళాపరిషత్ అధ్యక్షుడు, నాటక సమాజాల నిర్వహణ కార్యదర్శి, కాకినాడ యంగ్ మెన్స్ హ్యాపీ క్లబ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి, హసన్‌బాద గ్రామ సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు శనివారం ఆయన్ను కలసి అభినందించారు. కాకినాడలో చాగంటి కోటేశ్వరరావు నివాసంలో పుష్పగుచ్ఛం అందచేసి అభినందించారు. నాటక అకాడమీ చైర్మన్‌గా నియమితులైన గుమ్మడి గోపాలకృష్ణకు అభినందనలు తెలిపారు.

శాస్త్రికి సంజీవరాయశర్మ అవార్డు



చంద్రశేఖరశాస్త్రి

రామచంద్రపురం(ద్రాక్షారామ), నవంబరు 9: రామానుజన్ గణిత అకాడమీ సంజీవరాయశర్మ అవార్డు గణిత అవార్డుకు గణితశాస్త్ర నిపుణుడు శ్రీధర చంద్రశేఖర శాస్త్రిని ఎంపిక చేసినట్లు రామానుజన్ గణిత అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు కెవీవీ సత్యనారాయణ తెలిపారు. శ్రీధర చంద్రశేఖరశాస్త్రి దేశవ్యాప్తంగా గణితశాస్త్ర ప్రయోగశాలలు ఏర్పాటు చేసేందుకు కృషి జరుపుతున్నారని తెలిపారు. అనేక గణిత గ్రంథాల రచయిత అయిన శ్రీధర చంద్రశేఖరశాస్త్రి 2003లో అసోసియేషన్ ఆఫ్ మ్యాథమెటిక్స్ టీచర్స్ ఆఫ్ ఇండియా ఇన్నోవేటివ్ టీచర్స్ అవార్డు పొందారని తెలిపారు. డిసెంబరు 15న జరుగనున్న రామానుజన్ గణిత అకాడమీ వార్షికోత్సవ సదస్సులో అవార్డు అందచేస్తామన్నారు.

పర్యావరణాన్ని కాపాడాలి

రావులపాలెం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మొక్కలను ప్రతి ఒక్కరూ సంరక్షించాలని వీటి ద్వారా పర్యావరణాన్ని కాపాడుకోవచ్చునని ఉపాధి హామీ ఏపీవో కవిత అన్నారు. రావులపాలెం జడ్పీ బాలుర, బాలికల పాఠశాల ఆవరణలో విద్యా కమిటీ చైర్మన్ల ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కలు దోహదపడతాయని వక్తలన్నారు.



నెక్కంటికాలనీలో రహదారిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సత్యానందరావు

అభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయం

కొత్తపేట ఎమ్మెల్యే బండారు

రావులపాలెం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తున్నదని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. ఈతకోట నెక్కంటి సీఫుడ్స్ సమీపంలో నిర్మించిన రహదారిని ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని, అధ్వానంగా ఉన్న రహదారులను ఆధునీకరించేందుకు చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ యర్రంశెట్టి సుబ్బలక్ష్మి, నెక్కంటి సీఫుడ్స్ మేనేజర్ సీతారామయ్య, నాయకులు గుత్తుల పట్టాభిరామారావు, మిరియాల రాము, యర్రంశెట్టి రాము, గండ్రోతు వీరగోవిందరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

చర్చిల అభివృద్ధి కృషి

చర్చిల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే అన్నారు. ఈతకోట-గంటిరోడ్డులో ఉన్న ఒలివల స్వస్థతశాల వార్షికోత్సవ ముగింపు సభ పాస్టర్ పమ్మి అమృతరావు ఆధ్వర్యంలో జరిగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ చర్చిల అభివృద్ధికి సహకారం అందిస్తానన్నారు. ముగింపు సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. ఎమ్మెల్యేను సత్కరించారు. కార్యక్రమంలో పాస్టర్లు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

మందపల్లి ఆలయంలో భక్తుల సందడి

కొత్తపేట, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మందపల్లి శనేశ్వర(మందేశ్వర) స్వామి ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. వేకువజాము నుంచే స్వామివారి సర్వదర్శనాలు, తైలాభిషేకాలకు భక్తులు బారులు తీరారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. వివిధ సేవల ద్వారా స్వామివారికి రూ.1,94,192 ఒక్కరోజు ఆదాయం వచ్చినట్లు ఆలయ సహాయ కమీషనరు నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.



శనేశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

శివాలయంలో ఘనంగా లక్ష బిల్వార్చన

రాయవరం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెదురుపాక పార్వతి సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో లక్షబిల్వార్చన జరిపారు. గాయత్రి బ్రాహ్మణ సంఘం ప్రెసిడెంట్ దంతుర్తి సుబ్రహ్మణ్య శర్మ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కొత్తపల్లి సుబ్రహ్మణ్య బాపూజీ, శ్రీదేవి, వారణాసి నటరాజేశ్వర నరసింహమూర్తి, పద్మ దంపతులు పూజలు చేశారు. వేద పండితులు వినాయకపూజ, మండపారాధన, పుణ్యాహ వచనం, సూర్యనమస్కారాలు జరిపారు. సోమేశ్వరస్వామికి ఏకవార రుద్రాభిషేకంలో భాగంగా 21 ద్రవ్యాలతో స్వామివారికి అభిషేకాలు, లక్షబిల్వార్చన, పార్వతి అమ్మవారికి లక్ష కుంకుమార్చన, జ్యోతిర్లింగార్చన, విశేష అలంకరణ అనంతరం నీరాజన మంత్రపుష్పాలు జరిపారు. కార్యక్రమంలో దంతుర్తి రామకృష్ణ, దత్తుడు, డీవీఆర్‌కే శాస్త్రి, శివరామం, సుబ్రహ్మణ్యం, సూర్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



సోమేశ్వరస్వామికి రుద్రాభిషేకం చేస్తున్న దృశ్యం

బెల్ట్‌షాపుపై దాడి ఇద్దరి అరెస్టు

ఆలమూరు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ఆలమూరు ఎక్సైజ్ అధికారుల దాడిలో బెల్ట్‌షాపు నిర్వాహకులు ఇద్దరిని అరెస్టు చేశారు. ఆలమూరు ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఐడి నాగేశ్వరరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చెముడులంక బస్టాండ్ సమీపంలో జాతీయ రహదారి పక్కన ఒక షెడ్డులో అనధికారికంగా బెల్ట్‌షాపు నిర్వహిస్తున్న ఎస్.సీతారామయ్యను అరెస్టు చేసి ఎనిమిది మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. కపిలేశ్వరపురంలో బెల్ట్‌షాపు నిర్వహిస్తున్న ఎస్.తమ్మయ్యను అదుపులోకి తీసుకుని 12 సీసాల మద్యం స్వాధీనం చేసుకున్న ట్లు తెలిపారు. ఈ దాడిలో ఎస్ఐ పి.రాంబాబు సిబ్బంది తదితరులుపాల్గొన్నారు.

ఘనంగా లక్షతులసి పూజ



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

మండపేట, నవంబరు 9(ఆంధ్రజ్యోతి) పట్టణంలోనున్న శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. స్వామివారికి శనివారం పంచామృత అభిషేకాలు, లక్షతులసి పూజ జరిపారు. ఆలయ అర్చకస్వాములు చినబాబు, పెదబాబుల సారధ్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితుల మంత్రాల మధ్య లక్షతులసి పూజ జరిపారు. కార్య క్రమంలో స్వామివారిని భక్తులు దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టీ పోతంశెట్టి సత్తిబాబు, ట్రస్టు సభ్యులు ఆలయ ఈవో కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అన్నసమారాధన

రాయవరం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వి.సావరం శివారు తుల్యాబాగ వంతెన వద్ద ఉన్న అభయాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం పురస్కరించుకుని శనివారం అన్నసమారాధన ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్న సమారాధనలో రాయవరం, వి.సావరం, వెదురుపాక, నదురుబాద, ఆరికరావుల, కొమరిపాలెంపరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

గోపాష్టమి వేడుకలు

మండపేట, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): సనాతన ధర్మం పరిరక్షణ అందరి బాధ్యతని పలువురు ఆధ్యాత్మికవేత్తలు పిలుపునిచ్చారు. విశ్వహిందూ పరిషత్, కామేశ్వరి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో గోశాల వద్ద రాజరాజేశ్వర రుద్రశర్మ సారధ్యంలో గోపాష్టమి, హనుమాన్‌చాలీసా పారాయణ నిర్వహించారు.